




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 224, పేజీలు - 08

మంగళవారం, జనవరి 27, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## పరేడ్ గ్రౌండ్స్‌లో

# రిపబ్లిక్ డే వేడుకలు

### - జాతీయ పతాకావిష్కరణ చేసిన గవర్నర్




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో 77వ గణతంత్ర దినోత్సవం అట్టహాసంగా జరిగింది. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మార్చ్‌ఫాస్ట్, శకటాల ప్రదర్శన, కళారూపాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రసంగించిన గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గణతంత్ర దినోత్సవం కేవలం పండుగ మాత్రమే కాదు, మన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం, రాజ్యాంగ విలువలను కాపాడటం, వైవిధ్యంలో ఐక్యతను సాధించాలనే గురుతర బాధ్యతను గుర్తు చేసే పవిత్ర దినంగా గవర్నర్ అభివర్ణించారు. ఇది భారత ఆత్మను ప్రతిబింబించే జాతీయ పండుగని కొనియాడారు. "మన రాజ్యాంగ నిర్మాణానికి ప్రజాస్వామ్యమే పునాది. ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల ద్వారా పాలనను అందించడానికి ఇది మార్గ నిర్దేశం చేస్తుంది. ఈ పవిత్ర దినాన న్యాయం, సమానత్వం, సోదరభావం వంటి విలువలను మరింత పరిరక్షించడానికి పునరంకితమవుతూ ముందుకు సాగాలి. ఇవే ఒక బలమైన దేశానికి మూల స్థంభాలు." అని పిలుపునిచ్చారు. తర్వాత తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై తన ప్రసంగంలో ప్రస్తావించారు గవర్నర్. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెండేళ్ల క్రితం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం గణనీయమైన విజయాలను సాధించి ప్రజల విశ్వాసాన్ని, ప్రశంసలను సంపాదించింది. రెండు సంవత్సరాల పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రభుత్వం 'తెలంగాణ రైజింగ్ విజన్--2047' అనే దార్శనిక పత్రాన్ని ఆవిష్కరించింది. దీని ద్వారా ప్రభుత్వం సమగ్ర, సమానమైన, సుస్థిర అభివృద్ధికి రోడ్‌మ్యాప్‌ను ప్రకటించింది." అని వెల్లడించారు. 'వికసిత్ భారత్' ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం 2047 నాటికి 30



ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటే తెలంగాణ రాష్ట్రం కూడా 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న టార్గెట్ పెట్టుకున్నట్టు గవర్నర్ వెల్లడించారు. దీని కోసం గత డిసెంబరులో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ప్రపంచ ప్రతినిధుల మధ్య తెలంగాణ

2లో..

## కర్తవ్యపథ్‌లో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించిన

# రాష్ట్రపతి ముర్ము

### - దేశ సైనిక శక్తిని, అభివద్ధి పథాన్ని ప్రదర్శించేలా పరేడ్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశవ్యాప్తంగా 77వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతం ఆలపించారు. సైనికుల నుంచి 21 గన్ సెల్యూట్ స్వీకరించారు. వందేమాతరానికి 150 ఏళ్లు ప్రధాన ఇతివృత్తంతో కర్తవ్యపథ్‌లో వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలపై 4 ఎంఐ-17 హెలికాప్టర్లు పూలవర్షం కురిపించాయి. ఈ వేడుకలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, విదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక అతిథులు పాల్గొన్నారు. వారిలో ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ ఉన్నారు. ఈ వేడుకల్లో పలువురు కేంద్ర మంత్రులు, అధికారులు సైతం పాల్గొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత రక్షణ దళాలు కవాతు నిర్వహించాయి. వివిధ విభాగాలకు చెందిన యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో విన్యాసాలు చేపట్టారు. ఈ పరేడ్‌లో ఐరోపా సమాఖ్యకు చెందిన సైనిక బృందం కూడా పాల్గొంది.

2లో..

## హార్వార్డ్ క్లాసులకు

# విద్యార్థిగా సీఎం రేవంత్

### - గడ్డకట్టే చలిలోనూ లీడర్‌షిప్ కోర్సు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రపంచంలోనే ఒక ప్రతిష్ఠాత్మక ఐవీ లీగ్ యూనివర్సిటీలో నాయకత్వ శిక్షణ పొందుతున్న తొలి సిట్టింగ్ ముఖ్యమంత్రిగా ఆయన రికార్డుకెక్కారు. అమెరికాలోని హార్వర్డ్ కెన్నెడీ స్కూల్‌లో 21వ శతాబ్దం కోసం నాయకత్వం: అస్తవ్యస్తత, సంఘర్షణ మరియు ధైర్యం అనే ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్?లో ఆయన విద్యార్థిగా చేరారు. జనవరి 25న ప్రారంభమైన ఈ శిక్షణలో భాగంగా తొలిరోజు ఓరియంటేషన్ అనంతరం అథారిటీ , లీడర్‌షిప్ విశ్లేషణ అనే అంశంపై జరిగిన సెషన్‌లో ఆయన పాల్గొన్నారు.

**ఏమిటీ కోర్సు.? దీని ప్రత్యేకతలేంటి.?**

ఈ వారం రోజుల కోర్సు కేవలం అధికార

2లో..

## అమరావతిలో తొలిసారిగా

# రిపబ్లిక్ డే వేడుకలు

### - రాష్ట్ర ప్రగతి ప్రయాణాన్ని వివరించిన గవర్నర్

- భద్రతా దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించిన గవర్నర్
- 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడి
- వేడుకలకు హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో రిపబ్లిక్‌డే ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమరావతిలో తొలిసారిగా గణతంత్ర వేడుకలను నిర్వహించ్చరు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ జాతీయ జెండాను ఎగరేవేశారు. హైకోర్టు సమీపంలో సీడ్ యాక్సెస్ రోడ్డు పక్కన 22 ఎకరాల్లో నిర్వహించిన సెలబ్రేషన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్?తోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న ముఖ్య అతిథి గవర్నర్‌కు 11 దళాలు గౌరవ వందనం సమర్పించాయి. అనంతరం 22 శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. రాష్ట్ర స్థితిగతులను, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాయి. వేడుకల తర్వాత గవర్నర్ ప్రసంగిస్తూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని, ప్రజలకు

2లో..



## పాలనలో టెక్నాలజీ

# వినియోగం పెంచాలి

- ఉద్యోగులపై పని భారం తగ్గించాలన్న సీఎం చంద్రబాబు
- డేటా ఆధారిత పాలనే లక్ష్యం.. ఆర్టీజీఎస్‌పై సీఎం సమీక్ష
- 2026ను 'టెక్నాలజీ డ్రివెన్ డిసిషన్ మేకింగ్ ఇయర్'గా మార్చాలని పిలుపు
- ప్రభుత్వ సేవల్లో కృత్రిమ మేధ వినియోగం పెంచాలని సీఎం ఆదేశం
- 'మన మిత్ర' ద్వారా ఇప్పటివరకు 1.43 కోట్ల మందికి సేవలు



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ ప్రభుత్వం పాలనలో సాంకేతికతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా ప్రజలకు పౌరసేవలను మరింత సులభంగా చేరవేసేలా మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ సేవలు ప్రారంభించింది. వాట్సప్ ద్వారా రెవెన్యూ, వ్యవసాయ, సివిల్ సప్లై వంటి శాఖల సేవలతో పాటుగా

2లో..


## కాంగ్రెస్‌కు ప్రజల్లో

# వ్యతిరేకత మొదలైంది

### - కోదండరాం సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఎన్నికల సంఘం కూడా వేగంగా సన్నాహాలు చేస్తోంది. రేపోమాపో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో తెలంగాణ జనసమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

2లో..



## లోక్‌భవన్‌లో

# ఘనంగా ఎట్ హోం

### - ఎక్సలెన్స్ అవార్డులు ప్రదానం చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నగరంలోని లోక్‌భవన్‌లో 77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నిర్వహించిన 'ఎట్ హోం' కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన ప్రముఖులకు గవర్నర్ అవార్డ్స్ ఫర్ ఎక్సలెన్స్ ను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం రాష్ట్రంలోని రాజకీయ, న్యాయ, అధికార వర్గాలకు చెందిన వారి కలయికకు వేదికగా నిలిచింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఇచ్చిన ఈ తేనీటి విందులో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రధాన అతిథులుగా పాల్గొన్నారు. వీరితో

2లో..

# విజయవాడ లోక్ భవన్ లో 'ఎట్ హోం'

### - హాజరైన చంద్రబాబు, పవన్, లోకేశ్

**అమరావతి (ప్రశ్న న్యూస్)** 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ విజయవాడలోని లోక్ భవన్‌లో 'ఎట్ హోమ్' కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సాంప్రదాయ తేనీటి విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తదితరులు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాజ్యాంగ అధిపతులు, పరిపాలన, న్యాయవ్యవస్థకు చెందిన ప్రముఖులు ఒకేచోట చేరడంతో ఈ కార్యక్రమం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్,

2లో..



# ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం

### - సంతోష్ రావుకు సిట్ నోటీసులు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్ రావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. నేడు మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు రావాలని సంతోష్‌రావు కు ఆదేశాలు ఇచ్చింది. ఇక ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటికే కేటీఆర్, హరీష్‌రావులను సిట్ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. తెలంగాణలో సంచలనం రేపుతున్న ఫోన్ట్యాపింగ్కేసులో సిట్ అధికారులు విచారణను వేగవంతం చేశారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీకి చెందిన కీలక నేతలు కేటీఆర్, హరీష్ రావులను సిట్

2లో..



## మేడారంలో వనదేవతల్ని దర్శించుకున్న

# న్యూజిలాండ్ గిరిజన తెగ

### - ఆకట్టుకున్న హాకా నృత్యం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఆసియాలోనే అతిపెద్ద ఆదివాసీ గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో ఒక అరుదైన ఘట్టం చోటుచేసుకుంది. న్యూజిలాండ్?కు చెందిన 'మావోరీ' గిరిజన తెగ ప్రతినిధులు ఈ జాతరను సందర్శించి, వనదేవతలను దర్శించుకోవడమే కాకుండా మేడారం గద్దెల ప్రాంగణంలో తమ సంప్రదాయ 'హాకా' నృత్యాన్ని ప్రదర్శించారు. మావోరీ సంస్కృతిలో హాకా నృత్యం అనేది యుద్ధానికి

2లో..

## అమరావతిలో తొలిసారిగా రిపబ్లిక్ డే వేడుకలు

అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. భవిష్యత్‌లో చేపట్టబోయే పనులను ప్రజలకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అమరావతిలో జాతీయ జెండాను తొలిసారిగా ఎగరవేసినందుకు గవర్నర్ ఆనందం వ్యక్తం చేశారు. చాలా ఏళ్ల నుంచి రాష్ట్రం దిశానిర్దేశం లేకుండా సాగిందని రాజధాని ప్రాజెక్ట్ నిలిచిపోయిందని పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీసింది ఆర్థిక స్థిరత్వాన్ని పడిందని జగన్ కాలాన్ని గుర్తు చేస్తూ ప్రసంగం చేశారు.సవాళ్లు ఎన్ని ఉన్నప్పటికీ, కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో పని చేస్తోందని గవర్నర్ తన ప్రసంగంలో తెలియజేశారు. ప్రతి పని, ప్రతి సంస్కరణ, ప్రతి సమీక్ష వృద్ధిని పునరుద్ధరించడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా సాగుతుందన్నారు. ఇది అంత సులభం కాదని క్రమశిక్షణతోపాటు విశ్వాసం అవసరమన్నారు. ఇప్పుడు ఫలితాలు కనిపిస్తున్నాయని, ప్రాజెక్టులు కదులుతున్నాయని సంస్థలు బలపడుతున్నాయని పేర్కొన్నారు. భారతదేశ స్వాతంత్ర్య శతాబ్ది నాటికి బలమైన, ప్రపంచంలో మేటి రాష్ట్రాన్ని నిర్మించడమే లక్ష్యంగా స్వర్ణ ఆంధ్ర ఏ 2047 రూపొందించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు జరిగింది, ఇకపై జరగబోయే అంశాలను పది విషయాలుగా వివరించి తన ప్రసంగంలో ప్రస్తావించారు. అందులో మొదటిది పేదరికం లేని సమాజం అని వెల్లడించారు. "పేదరికం లేని సమాజం కోసం సూపర్ సిక్స్ అమలు చేస్తున్నాం. దీని ద్వారా ప్రతి వ్యక్తికి గౌరవం, భద్రత, ఆనందం, ప్రతి కుటుంబానికి సాధికారతను అందించడానికి ప్రధానమైనది. ధనవంతులు పేదల మధ్య అంతరం పెరుగుతోంది. సంపద సృష్టి, అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలతో బలమైన సంక్షేమ చర్యలు తీసుకొని దీన్ని తగ్గించేందుకు నా ప్రభుత్వం శ్రమిస్తోంది."ఎన్టీఆర్ భరోసా కింద, నా ప్రభుత్వం బలహీన వర్గాలకు మద్దతుగా నిలుస్తోంది. ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా నెలవారీ పెన్షన్ ఇప్పుడు 4,000 ఇస్తోంది. వైకల్యం ఉన్నవారికి 6,000, మొత్తం 63.12 లక్షల మంది పెన్షనర్లు ఎన్‌ఈఆర్పీ ద్వారా ప్రయోజనం పొందుతున్నారు, ఇది వారి దైనందిన జీవితంలో గౌరవాన్ని పెంపొందిస్తోంది. డయాలసిస్, దీర్ఘకాలిక మూత్రపిండ రోగులకు, పెన్షన్‌ను 10,000 అందిస్తోంది. పూర్తి వైకల్యం, తీవ్రమైన కండరాల బలహీనత, ప్రమాద బాధితులకు నెలకు 15,000 ఇస్తోంది. దీపం 2.0 1.08 కోట్ల మంది లబ్ధిదారులకు పేద కుటుంబాలకు సంవత్సరానికి 3 ఉచిత ఎల్పీజీ సిలిండర్లను అందిస్తోంది. ఐరన్, విటమిన్ బి12, ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉండే బలవర్ధకమైన బియ్యం సరఫరా చేస్తోంది. ఏఏవై కుటుంబాలకు ఉచిత బియ్యం అందిస్తోంది. ఆగస్టు 15, 2025న ప్రారంభమైన స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం 37.80 కోట్ల మంది మహిళలు, బాలికలు ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ప్రయాణించడానికి వీలు కల్పించింది. దీంతో బస్సు ప్రయాణాల్లో మహిళల వాటాను 40% నుంచి 65%కి పెరిగింది.డైనమిక్ "ఫ్యామిలీ స్కోర్"తో కూడిన కొత్త ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ జూన్ 2026 నుంచి గృహాలను వర్గీకరించి ఫ్యామిలీ కార్డులను జారీ చేస్తుంది, సంక్షేమ కవరేజీని 90.74% నుంచి 98.15%కి పెంచుతుందని గవర్నర్ వెల్లడించారు. "పీఎం స్వనిది కింద 3.42 లక్షల కుటుంబాలకు ?978 కోట్లు పంపిణీ అవుతోంది, 3 నగరాల్లో త్రిప్తి క్యాంటీన్లు, 2,673 ఆఫర్లతో 18 ఉద్యోగ మేళాలు, ఆటో డ్రైవర్ సేవలో కింద 2.90 లక్షల ఆటో, టాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు 436 కోట్ల వ్యయంతో ?15,000 వార్షిక మద్దతు." కల్పించామన్నారు. వెనుకబాటుతనం ఆధారంగా ఎస్సి ఉప సమూహాలలో సమాన రిజర్వేషన్లు ఉండేలా ఎస్సి ఉప-వర్గీకరణను చేపట్టారు. షెడ్యూల్డ్ కులాలకు ఆర్థిక సహాయం బాగా పెరిగింది - 2019--24లో సంవత్సరానికి సగటున 70 కోట్ల నుంచి 2024--26లో సంవత్సరానికి 115 కోట్లకు. అదనంగా, 11.44 లక్షల మంది ఎస్సీ పెన్షనర్లకు ?3,938.75 కోట్లు విడుదలయ్యాయి, 2025--26 సంవత్సరానికి, 20,692 మంది లబ్ధిదారులకు స్థిరమైన జీవనోపాధిని సృష్టించడానికి ఎస్సీ ఆర్థిక సహాయ పథకాల కింద 341 కోట్లు కేటాయించారు.ఈ సంవత్సరం బీసీ సహకార ఆర్థిక సంస్థ ద్వారా 11,620 కోట్లు కేటాయించింది. శాసనసభలలో బీసీలకు 33% రిజర్వేషన్లు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులలో 34% రిజర్వేషన్లు అమలకు చర్యలు తీసుకోవడంతో ప్రాతినిధ్యం బలపడింది. విద్యకు సంబంధించి, ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం 686.64 కోట్లు, పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు 420.74 కోట్లు విడుదలయ్యాయి. పూజారులకు నెలకు రూ.15,000, నాయీ బ్రాహ్మణులకు రూ.25,000 వేతనాలు ఇస్తున్నారు. గిరిజన సంక్షేమం కింద, 8,159.68 కోట్లు, షెడ్యూల్డ్ తెగలకు 4,726.46 కోట్లు ఖర్చు చేశారు. పెట్టుబడులలో తజంగి (ఏఎస్ఆర్ జిల్లా)లో 35 కోట్ల గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం, పీఎం-జాన్మాన్ కింద మౌలిక సదుపాయాలు ఉన్నాయి, పివిటీజీ నివాసాల కోసం 249 రోడ్లు, 183 హాస్టళ్లు మంజూరు అయ్యాయి. మైనారిటీల కోసం, 4.38 లక్షల పెన్షనర్లకు 2,800 కోట్లు విడుదల అయ్యాయి. ఎంఎస్ఎంఈలకు రుణ మద్దతుగా 310 కోట్లు ప్రతిపాదనలు ఉన్నాయి. అంకితభావంతో కూడిన రెవెన్యూ అధికారుల ద్వారా వక్ఫ్ రక్షణను బలోపేతం చేస్తున్నారు, 5,000 మంది ఇమామ్‌లు, 5,000 మంది మౌజిన్‌లకు 80 కోట్లు గౌరవ వేతనంగా పొడిగించారు. అలాగే 8,427 మంది పాస్టర్లకు 80 కోట్లు ఇస్తున్నారు.స్వర్ణాంధ్ర 2047లో "అందరికీ గృహాలు" కింద, అర్హత ఉన్న అన్ని కుటుంబాలకు పక్కా ఇళ్ళు అందిస్తున్నారు - 3 లక్షల గృహాలు 2025 నవంబర్ 12న ప్రారంభమయ్యాయి. మరో 5 లక్షల గృహాలు 2026 ఉగాది నాటికి పూర్తవుతాయి. ఈ కార్యక్రమంలో ఎస్సి, ఎస్టి, బీసీ లబ్ధిదారులకు 3,220 కోట్ల అదనపు మద్దతు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల గృహ స్థలాలు భూమి లేనివారికి ఇచ్చారు. 2025 ఉగాది రోజున ప్రారంభమైమన పీ4 కార్యక్రమం ప్రభుత్వం, పరిశ్రమ, సంఘాలను ఏకం చేయడం ద్వారా జనాభాలో దిగువన ఉన్న 20% మందిని పేదరికం నుంచి బయటపడేసేందుకు ఉపయోగపడనుంది. 1 లక్షకుపైగా "మార్గదర్శులు" 10.30 లక్షల "బంగారు కుటుంబాలు" దత్తత తీసుకున్నారు. ఐదు సంవత్సరాల్లో 20 లక్షల ఉద్యోగాలను సృష్టించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మెగా డిఎస్సి-2025 ద్వారా, 92.9% హాజరుతో 15,941 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశారు. గత సంవత్సరం 5,757 మంది కొత్త పోలీస్ కానిస్టేబుళ్లను నియమించారు. "స్కిల్ పాస్‌పోర్ట్" ద్వారా 6వ తరగతి నుంచి స్కిల్‌ను ట్రాక్ చేస్తుంది. ఏఐ రెజ్యూమ్ బిల్డర్, వాయిస్ అసిస్టెంట్ "ఆస్క్ విద్య"ని కలిగి ఉన్న "నైపుణ్యం" ప్లాట్‌ఫామ్ యువతను ప్రపంచ ఉద్యోగాలకు అనుసంధానిస్తుంది." అని వివరించారు.10 లక్షల కోట్ల గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రాజెక్ట్ 7.5 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తుంది, 4.18 లక్షల కోట్ల విలువైన 75 కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు 3.18 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తాయి. ఎలక్ట్రానిక్, టాయ్, సోలార్, డ్రోన్, స్పేస్, బల్క్ డ్రగ్ అనే నగరాలు అభివృద్ధిలో ఉన్నాయి. ప్రధాన నగరాల్లో ప్రతినిధులతో అమరావతిలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ స్టార్టప్‌లు ఎంఎస్ఎంఈలను నడిపిస్తుంది. ఉద్యోగ సృష్టితోపాటు, క్షీణిస్తున్న సంతానోత్పత్తి, జనాభా పెరుగుదల యుగంలో నా ప్రభుత్వం సమర్థవంతమైన మానవ వనరుల నిర్వహణపై దృష్టి సారిస్తోంది.

## విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న
# కొలువుల ప్రవీణ్ కృషి హర్షణీయం

**- బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు : సత్యనారాయణ**
**- బూరుగుపల్లి ప్రభుత్వ పాఠశాలకు టీవీ అందజేత**




**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు,పాఠశాల పూర్వ విద్యార్థి కొలుపుల ప్రవీణ్ టీవీని విరాళంగా అందజేశారు. గతంలో ఇచ్చిన హామీని నెరవేర్చుతూ విద్యార్థుల సౌకర్యార్థం ఈ టీవీని పాఠశాలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ కొలుపుల ప్రవీణ్‌కు అభినందనలు తెలియజేస్తూ, విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇది ఎంతగానో దోహదపడుతుందని,ప్రవీణ్ చేస్తున్నకృషి హర్షణీయం అని,కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య -- మహేష్, ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, వార్డు సభ్యులు అక్కరాజు తిరుపతి, మ్యాన వర్షిత వెంకటేష్, అతికం రాజశేఖర్ గౌడ్, కొలుపుల మల్లేశం, కల్లెపల్లి మమత, బరిగే రాధా -- రమేష్తో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరేడ్ గ్రౌండ్స్‌లో
# రిపబ్లిక్ డే వేడుకలు

రైజింగ్ -2047 దార్శనిక పత్రాన్ని ఆవిష్కరించామని తెలిపారు.

### మూడు ప్రాంతాల వారీగా అభివృద్ధి

రాష్ట్రాన్ని మూడు ప్రాంతాలుగా అభివృద్ధి సాధించాలని ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజల ముందు ఉంచారు. అందులో మొదటిది కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పేరుతో హైదరాబాద్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించి, కాలుష్యాన్ని తగ్గిస్తూ ప్రపంచ స్థాయి నగరంగా తీర్చిదిద్దాల్సి ఉంటుందని అన్నారు. రెండోది పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ పేరుతో ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాన్ని తయారీ రంగానికి కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. రూరల్ అగ్రికల్చర్ రీజినల్ ఎకానమీ పేరుతో రీజినల్ రింగ్ రోడ్‌కు బయట ఉన్న రాష్ట్రంలోని ఇతర గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం, హరిత ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టబోతున్నారు. ఈ దార్శనిక పత్రంలోని లక్ష్యాలను సాధించడానికి ప్రభుత్వం నిర్మాణాత్మక చర్యలు చేపట్టడంపై దృష్టి పెట్టిందని, ఈ విధానం ద్వారా రాష్ట్రంలో సమతుల్య, సమానమైన, సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు.

### - మౌలిక సదుపాయాలు, భవిష్యత్తు ప్రణాళికలు

తెలంగాణ రైజింగ్--2047 ప్రణాళిక ద్వారా గాంధీ సరోవర్ ప్రాజెక్టు(బాపూఘాట్), గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రై పోర్టులు, రెండో దశ మెట్రో రైలు, ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్ల మధ్య రేడియల్ రోడ్లు, వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలు, హైదరాబాద్--నాగపూర్, హైదరాబాద్--బెంగళూరు, హైదరాబాద్--విజయవాడ పారిశ్రామిక కారిడార్లను నిర్మించనున్నట్లు గవర్నర్ తన ప్రసంగంలో వెల్లడించారు. ఇవన్నీ 2047 నాటికి తెలంగాణను దేశ పురోగతిలో కీలక పాత్రధారిగా నిలబెడతాయని ఆకాంక్షించారు.

### - సంస్కృతి, సంప్రదాయాలు, సంక్షేమం

తెలంగాణ రాష్ట్రానికే ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని కూడా గవర్నర్ తెలిపారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాన్ని జరుపుకొంటూ, 2025లో జిల్లా కలెక్టరేట్‌లలో తెలంగాణ తల్లి విగ్రహాలను ప్రతిష్ఠించామని వెల్లడించారు. అందెశ్రీ రచించిన "జయ జయ హే తెలంగాణ"ను రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించామన్నారు. గిరిజన గ్రామమైన మేడారంలో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా కేబినెట్ సమావేశాన్ని నిర్వహించి, సమ్మక్క--సారలమ్మ మహాజాతరకు శాశ్వత మౌలిక వసతుల కోసం రూ.251 కోట్లను మంజూరు చేశామన్నారు.రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని గవర్నర్ వెల్లడించారు. "వ్యవసాయ రంగానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా చేస్తోంది. రూ.2 లక్షల వరకు రైతు రుణాలను మాఫీ చేసి రూ.20,617 కోట్ల వ్యయంతో సుమారు 26 లక్షల మంది రైతులకు లబ్ధి చేశాం. రైతు భరోసా పథకం కింద ఎకరాకు సంవత్సరానికి అందించే సహాయాన్ని గత సంవత్సరం రూ.10,000 నుంచి రూ.12,000కు పెంచి సాగు పెట్టుబడిని అందిస్తోంది. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తోంది. సన్న ధాన్యంపై క్వింటాలుకు రూ.500 బోనస్ కూడా అందిస్తోంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 14.24 లక్షల మంది రైతుల నుంచి సుమారు 72 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేశాం. ఇప్పటివరకు రూ.17,079.50 కోట్ల చెల్లించాం. అదనంగా రూ.1,453 కోట్లను బోనస్ సబ్సిడీ అందించాం. ఈ విధానాలతో తెలంగాణ దేశంలోనే వరి ఉత్పత్తిలో అగ్ర స్థానంలో నిలిచింది. ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు బియ్యం ఎగుమతి చేస్తూ అంతర్జాతీయ మార్కెట్లలోనూ ఉనికి చాటింది. రైతుల ఆర్థికాభివృద్ధికి స్థిరమైన వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతికతలు, మట్టిసార నిర్వహణ, సేంద్రీయ వ్యవసాయం, సంక్షేమ పథకాల సమర్థ అమలు లక్ష్యంగా ఫార్మర్ కమిషన్‌ను తొలిసారిగా ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఉత్పాదకత పెరిగి, రుణ బాధలు తగ్గనున్నాయి."అని గవర్నర్ వెల్లడించారు. సమస్యలతో నిండిన ధరణి పోర్టల్ స్థానంలో రైతులకు అనుకూలమైన భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని తెలిపారు. దీని ద్వారా దీర్ఘకాలిక భూవివాదాలకు పరిష్కారం లభించినట్లు వెల్లడించారు.చాలా కాలం తర్వాత టీఎస్‌పీఎస్సీ ద్వారా గ్రూప్-I, II, III, IV నియామకాలు పూర్తి అయినట్టు గవర్నర్ వెల్లడించారు. ఇప్పటివరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా 62,749 ఉద్యోగాలు కల్పించినట్టు వివరించారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ ప్రారంభించారని పేర్కొన్నారు. ఇప్పటివరకు 1,22,337 మంది నమోదు కాగా, 1,892 వివిధ కంపెనీల యజమానులు ఇందులో చేరినట్టు తెలిపారు. యువతకు ఉపాధి నైపుణ్యాన్ని అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడమే కాకుండా పాఠశాల, ఉన్నత విద్య రంగాల్లో కీలక సంస్కరణలు చేపట్టామన్నారు. ఫ్యూచర్ సిటీలో సమగ్ర క్రీడా కేంద్రంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తోందని తెలిపారు. "ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రైవేట్ సంస్థలతో పోటీ పడేలా చర్యలు చేపట్టింది. సమర్థమైన విద్యా విధానాల రూపకల్పన కోసం ఎడ్యుకేషన్ కమిషన్ ఏర్పాటు చేసింది. మెస్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచింది. 25 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. పోలీస్ సిబ్బంది పిల్లల కోసం యంగ్ ఇండియా పోలీస్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభించింది." శాసన సభ ప్రాంగణంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ పాల్గొన్నారు. అనంతరం శాసన మండలి ప్రాణంలో కూడా చైర్మన్ గుత్తా జాతీయ జెండాను ఎగరేశారు. ఈ వేడుకలో ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## కర్తవ్యపథ్‌లో త్రివర్ణ పతాకాన్ని
# ఆవిష్కరించినరాష్ట్రపతి ముర్ము

ఈ వేడుకల్లో 17 రాష్ట్రాలు, 13 కేంద్ర ప్రభుత్వ శకటాలను ప్రదర్శించారు. దేశ సైనిక శక్తిని, అభివృద్ధి పథాన్ని ప్రతిబింబించేలా ఈ పరేడ్ కొనసాగింది. ఈ వేడుకల్లో భాగంగా భారత వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాకు అశోకచక్ర ప్రదానం చేశారు. గణతంత్ర వేడుకల నేపథ్యంలో 30 వేల మంది పోలీసులు, కేంద్ర బలగాలతో భద్రత ఏర్పాట్లు చేశారు.77వ గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో ప్రధాని మోదీ ఢిల్లీలోని వార్ మెమోరియల్ వద్ద అమరజవాన్లకు నివాళు లర్పించారు. అనంతరం కర్తవ్యపపథ్ కు చేరుకున్నారు. మోదీ వెంట రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ఉన్నారు. మరోవైపు రాష్ట్రపతి భవన్ నుంచి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కర్తవ్యపథ్‌కు చేరుకున్నారు. గుర్రపు బగ్గీలో ఐరోపా మండలి అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్‌లతో కలిసి ప్రయాణించారు. కర్తవ్యపథ్‌కు చేరుకున్నవారికి ప్రధానమంత్రి మోదీ స్వాగతం పలికారు.

## హార్వార్డ్ క్లాసులకు
# విద్యార్థిగా సీఎం రేవంత్

హోదా గురించి కాకుండా, క్లిష్ట పరిస్థితుల్లో నాయకత్వాన్ని ఒక ఆచరణాత్మకంగా గా ఎలా మలచుకోవాలనే అంశంపై దృష్టి సారిస్తుంది.

హార్వర్డ్ ప్రొఫెసర్లు టిమ్ ఓ'బ్రియన్, కరెన్ మోరిస్సీల నేతృత్వంలో సాగే ఈ ప్రోగ్రామ్?లో ప్రపంచవ్యాప్తంగా 20కి పైగా దేశాల నుంచి వచ్చిన సీనియర్ అధికారులు, నాయకులు భాగస్వాములవుతున్నారు. రాజ్యాంగబద్ధమైన అధికారంతోనే కాకుండా, సామాజిక మార్పు కోసం ప్రజలను ఎలా సమీకరించాలి, వ్యవస్థల్లో ఉండే ప్రతిఘటనలను ఎలా అధిగమించాలనే అడాప్టివ్ లీడర్?షిప్ మెళకువలను ఇందులో బోధిస్తారు.

### శిక్షణలో రేవంత్ రెడ్డి దినచర్య

ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ, అక్కడ రేవంత్ రెడ్డి ఒక సాధారణ విద్యార్థిలాగే గడుపుతున్నారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటలకే తరగతులు ప్రారంభమవుతున్నాయి. ఇందులో కేస్ స్టడీస్ విశ్లేషణ, రాతపూర్వక అసైన్‌మెంట్లు, హోంవర్క్ ,గ్రూప్ ప్రాజెక్టులు వంటివి భాగంగా ఉన్నాయి. వివిధ దేశాల ప్రతినిధులతో కూడిన చిన్న చిన్న బృందాల్లో చర్చలు జరపడం, తమ పనిలో ఎదురయ్యే సవాళ్లను ఒకరితో ఒకరు పంచుకుని పరిష్కారాలు అన్వేషించడం ఈ శిక్షణలో కీలక ఘట్టం. రాత్రి పొద్దుపోయే వరకు ఈ విద్యా సంబంధిత కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

### పాలనలో మార్పు దిశగా

తెలంగాణను గ్లోబల్ స్థాయిలో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ఉన్న రేవంత్ రెడ్డి, ఆధునిక పరిపాలనా పద్ధతులను అధ్యయనం చేసేందుకు ఈ అవకాశాన్ని ఎంచుకున్నారు. జనవరి 31 వరకు సాగే ఈ శిక్షణ ముగిశాక, ఆయన హార్వర్డ్ నుంచి అధికారిక సర్టిఫికెట్ అందుకోనున్నారు. ఫిబ్రవరి 2న తిరిగి హైదరాబాద్ చేరుకున్నాక, అక్కడ నేర్చుకున్న అంతర్జాతీయ స్థాయి నాయకత్వ మెళకువలను రాష్ట్ర పాలనలో, ముఖ్యంగా ప్రజా సంక్షేమ పథకాల అమలు , క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారంలో అమలు చేసే అవకాశం ఉంది.

## పాలనలో టెక్నాలజీ వినియోగం పెంచాలి

విద్యార్థులకు హాల్ టికెట్లు, తల్లి వందనం పథకం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల స్టేటస్‌లు తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఏపీలో ప్రస్తుతం 878 ప్రభుత్వ సేవలు అందిస్తున్నారు. వీటిని వేయికి పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు. మరోవైపు ఏపీలో మన మిత్ర వాట్సాప్ సేవలను ఇప్పటి వరకూ 1.43 కోట్ల మంది ఉపయోగించుకున్నారని అధికారులు వెల్లడించారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం రోజున ఆర్టీజీఎస్‌పై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి ఉద్యోగులపై పని భారం తగ్గించాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. సిబ్బందిలో సమర్థత లేకపోతే అలాంటి వారికి శిక్షణ ఇచ్చి, నిరంతర పర్యవేక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగానే మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 878 ప్రభుత్వ సేవలను అందిస్తున్నామని, ఇప్పటివరకు 1.43 కోట్ల మంది ఈ సేవలను వినియోగించుకున్నారని అధికారులు చంద్రబాబుకు వివరించారు.మరోవైపు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, కేవలం హాయ్ అనే మెసేజ్‌తో ప్రభుత్వ సేవలను ప్రజల ఇంటికి చేర్చే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్లాట్‌ఫామ్‌ను తీసుకువచ్చింది. మెటా సంస్థ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ చాట్‌బోట్ కోసం 95523 00009 అనే వాట్సాప్ నంబర్?ను కేటాయించారు. 161 సేవలతో ప్రారంభమైన మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్, ప్రస్తుతం 878 పౌర సేవలను అందిస్తోంది. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు, టెన్త్, ఇంటర్ హాల్‌టికెట్లు, ఫలితాల డౌన్‌లోడ్, ఏపీఎస్ఆర్టీసీ బస్సు టికెట్ల బుకింగ్, కరెంట్ బిల్లులు, మున్సిపల్ పన్నుల చెల్లింపుతో పాటుగా.. ఆలయాల్లో దర్శన టికెట్లు, వసతి గదుల బుకింగ్ వంటి సేవలు కూడా అందిస్తున్నారు. అలాగే ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదు చేసి, రిఫరెన్స్ నంబర్ ద్వారా స్టేటస్ తెలుసుకునే అవకాశం ఉంది. మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ప్లాట్‌ఫామ్ ద్వారా జారీ చేసే సర్టిఫికేట్లు అన్నీ క్యూఆర్ కోడ్ కలిగి ఉంటాయి. ఇవి బ్లాక్‌చైన్ టెక్నాలజీ , డిజి లాకర్?తో అనుసంధానించి ఉండటంతో నకిలీ పత్రాలకు తావుండదని.. ప్రజల వ్యక్తిగత డేటాకు పూర్తి భద్రత ఉంటుందని ప్రభుత్వం చెప్తోంది.

## కాంగ్రెస్‌కు ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది

సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని అన్నారు. సోమవారం మీడియా సమావేశంలో ప్రొఫెసర్ కోదండరాం చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

### - కాంగ్రెస్‌తో పొత్తు లేనట్లేనా.?

కాగా, రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయిలో తాము ప్రజల నాడిని గమనిస్తున్నామని ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత వేగంగా స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైనట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో.. కాంగ్రెస్ పార్టీతో తెలంగాణ జన సమితి పొత్తుపై కూడా కోదండరాం స్పందించారు. పొత్తుపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని టీజేఎస్ అధినేత చెప్పారు. తమ పార్టీ అభిప్రాయాలను ఇప్పటికే కాంగ్రెస్ అధిష్ఠానానికి వివరించామని కోదండరాం తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ జనసమితి కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, తమ అభిప్రాయాలను కాంగ్రెస్‌కు చెప్పి మార్చుకోవాలని కోరారా లేదా పొత్తు ఉండదని తెలియజేశారా అనే విషయంపై స్పష్టత లేదు.ఇదే కాకుండా మీడియా సమావేశంలో గత కొద్ది రోజులుగా సింగరేణిపై తలెత్తిన వివాదంపై కూడా ప్రొఫెసర్ కోదండరాం స్పందించారు. తెలంగాణకు జీవనాడి లాంటి సింగరేణిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలంగాణ పౌరుడిపై ఉందన్నారు. సింగరేణిని కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అది తెలంగాణ రాష్ట్ర సంపద అని కోదరండరాం చెప్పారు. ఇక తానూ ఫోన్ ట్యాపింగ్ బాధితుడినే అన్న కోదండరాం గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంతా అవినీతిమయం చేసిందని మండిపడ్డారు. ప్రజలు అధికారం ఇస్తే పదేళ్లలో కేసీఆర్ కుటుంబం తప్ప మరెవరూ బాగుపడలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాకముందే తెలంగాణలో రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ఓ వైపు అధికార పార్టీ అత్యధిక స్థానాలు గెలవాలని కసరత్తు మొదలుపెట్టింది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టి పోటీ ఇవ్వాలని చూస్తోంది. బీజేపీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ఇక జనసేన కూడా తామూ పోటీ చేస్తామని ప్రకటించింది. మరోపక్క కల్వకుంట్ల కవిత నేతఅత్వంలోని తెలంగాణ జాగృతి అభ్యర్థులు కూడా బరిలోకి దిగుతారని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ కోదండరాం కూడా పొత్తు నుంచి వైదొలిగి సొంతంగా పోటీ చేస్తే ఎన్నికలు మరింత రసవత్తరంగా మారనున్నాయి.

## విజయవాడ లోక్ భవన్ లో 'ఎట్ హోం'

ఆయన అర్ధాంగి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమం ప్రారంభంలో పోలీస్ బ్యాండ్ బృందం జాతీయ గీతాన్ని ఆలపించగా, ఆహూతులందరూ గౌరవ వందనం సమర్పించారు. ఈ వేడుకలో శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, పలువురు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.అనంతరం గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వేదికపై నుంచి కిందకు వచ్చి ఇతర అతిథులతో కలిసిపోయారు. స్వాతంత్ర్య సమరయోధులతో ప్రత్యేకంగా ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పద్మ పురస్కార గ్రహీతలు, కళాకారులు, క్రీడాకారులతో ఆత్మీయంగా పలకరించారు. నేతల మధ్య సరదా సంభాషణలతో లోక్ భవన్ ప్రాంగణమంతా ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా లోక్ భవన్?ను విద్యుత్ దీపాల అలంకరణలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న అధిపతులంతా ఒకేచోట చేరిన ఈ కార్యక్రమం, రాష్ట్రంలో పరిపాలన సామరస్యాన్ని ప్రతిబింబించింది. గత ఏడాది కాలంలో రాష్ట్రం సాధించిన ప్రగతి, గణతంత్ర స్ఫూర్తి గురించి పలువురు ప్రముఖులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ 'ఎట్ హోమ్' కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

## లోక్‌భవన్‌లో ఘనంగా ఎట్ హోం

పాటు రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు మరియు వివిధ పార్టీలకు చెందిన కీలక నేతలు హాజరయ్యారు. ఈ వేడుకలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ప్రజా ప్రతినిధులు ఒకే వేదికపై కనిపించడం విశేషం. గవర్నర్ అతిథులందరినీ సాదరంగా ఆహ్వానించి, వారితో స్నేహపూర్వకంగా ముచ్చటించారు. రిపబ్లిక్ డే ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే ఈ కార్యక్రమం పట్ల సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం

అధికారులు విచారించిన విషయం తెలిసిందే. అయితే తాజాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌రావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు నేడు మధ్యాహ్నం 3 గంటలకు జూబ్లీహిల్స్ లోని సిట్కార్యాలయంలో హాజరుకావాలని సంతోష్ ను ఆదేశించింది. ఇదే విషయాన్ని జూబ్లీహిల్స్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి. వెంకటగిరి స్పష్టం చేశారు. అయితే బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్‌రావుకు నోటీసులు జారీ చేయడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో పెను కలకలం రేపుతోంది. ఈ విచారణలో సిట్ అధికారులు సంతోష్ రావు నుండి ఎటువంటి సమాచారాన్ని రాబడతారనే అంశం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఇక ఐటీ చట్టం, ప్రభుత్వ ఆస్తుల నష్టం నిరోధక చట్టం వంటి కఠిన సెక్షన్ల కింద సిట్ అధికారులు విచారణ జరుపుతున్నారు.

## మేడారంలో వనదేవతల్ని దర్శించుకున్న
# న్యూజిలాండ్ గిరిజన తెగ

సిద్ధమయ్యే సమయంలో సైనికుల్లో ఉత్సాహాన్ని నింపడానికి, శత్రువుల గుండెల్లో వణుకు పుట్టించడానికి చేసే ఒక శక్తివంతమైన కళారూపం. ఈ నృత్యంలో కళాకారుల ముఖభావాలు, శరీర కదలికలు చూసేవారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. తెలంగాణ మరియు న్యూజిలాండ్ దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర పంచాయతీ రాజ్ మరియు స్త్రీ-శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఈ పర్యటన సాధ్యమైంది. మావోరీ తెగ ప్రతినిధులు తమ కళను ప్రదర్శిస్తున్న సమయంలో మంత్రి సీతక్క కూడా స్వయంగా వారితో కలిసి నృత్యం చేసి అందరినీ ఉత్సాహపరిచారు.

ఆదివాసీ సంస్కృతికి దేశ సరిహద్దులు, భాషలు అడ్డుకావని, ప్రపంచంలో ఎక్కడున్నా ఆదివాసీలు ప్రకృతిని, అడవిని నమ్ముకుని జీవిస్తారని, అందరి జీవన విధానం మరియు విశ్వాసాలు ఒకే తత్వాన్ని కలిగి ఉంటాయని ఈ సందర్భంగా మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. అనంతరం మావోరీ ప్రతినిధులను గద్దెల వద్దకు తీసుకెళ్లిన మంత్రి, సమ్మక్క-సారలమ్మల గొప్పతనాన్ని, వారి చారిత్రక నేపథ్యాన్ని స్వయంగా వివరించారు. వారికి వనదేవతల దర్శనం చేయించి, సంప్రదాయబద్ధంగా 'బంగారం' (బెల్లం), ప్రసాదాన్ని అందజేశారు. విదేశీ ప్రతినిధులను ఆత్మీయంగా సన్మానించి, తెలంగాణ ఆదివాసీ సంప్రదాయాలను వారికి పరిచయం చేశారు. విదేశీ గిరిజనుల రాకతో మేడారం జాతర ప్రాంగణమంతా ఒక అంతర్జాతీయ సాంస్కృతిక వేదికగా మారిపోయింది.

# ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలి

**ప్రపంచ దేశాల రాజ్యాంగంలో**

**భారతదేశ రాజ్యాంగం అత్యున్నతమైనది.**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని ప్రతి ఒక్కరు దేశభక్తిని అలవర్చుకోవాలని, ప్రపంచ దేశాలలో భారత దేశ రాజ్యాంగం అత్యున్నతమైనదని కాకతీయ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మంథని పట్టణం కాకతీయ పాఠశాలలో ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో చిన్నారులు అలరించారు. వేడుకల్లో పాఠశాల చిన్నారులు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో మెరిశారు. చిట్టి పొట్టి చిన్నారులు స్వాతంత్ర సమరయోధుల వేషధారణలో నినాదాలు చేయడం అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నో పోరాటాల ఫలితంగా దేశం స్వతంత్రం సంపాదించుకున్నామని, స్వతంత్రం సంపాదించిన తర్వాత దేశానికి ప్రణాళిక బద్ధమైన రాజ్యాంగం ఉండాలని మహనీయులు అందరూ భారతదేశానికి చక్కటి రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సహకారంతో భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైన రాజ్యాంగంగా కీర్తి గడిచిందని కొనియాడారు. రాజ్యాంగం విశిష్టతను ప్రతి విద్యార్థి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. రాజ్యాంగంలోని ప్రతి అంశం అవగాహన చేసుకోవాలని, ప్రతి విద్యార్థి తప్పకుండా దేశ నియమ నిబంధనలు పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి. స్రవంతి, పావని, విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పి ఆర్ సి యూత్ ఆధ్వర్యంలో బోడుప్పల్ సర్కిల్ పాఠశాల విద్యార్థులకు ఉచిత బెల్టులు పంపిణీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బోడుప్పల్ సర్కిల్ పెంటా రెడ్డి కాలనీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఈవెంట్ సందర్భంగా ఉచితంగా బెల్టులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని పి ఆర్ సి యూత్ నిర్వహించింది. ఈ సందర్భంగా మధుసురేంద్ర నాయుడు మాట్లాడుతూ, "మన పిల్లలకు క్రీడలు మరియు విద్య రెండూ సమానంగా అవసరం. ఇలాంటి చిన్న ప్రయత్నాలు వారిలో ఆటకు ప్రోత్సాహం, మనసులో హృదయపూర్వక శ్రద్ధను పెంపొందిస్తాయి" అన్నారు.కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు ముత్యమాచారి, రామకృష్ణ రాజు, లింగయ్య, సంపత్ రెడ్డి, నవీన్, అజయ్, అరణ్, జీవన్ రావు పాల్గొన్నారు.

# ఎర్రగుంటలో గణతంత్ర వేడుకలు



నాచారం (ప్రశ్న న్యూస్) ఎర్రగుంట నాచారం మహిళా మండల్ భవనం లో గణతంత్ర దినోత్సవం వేడుక సందర్భంగా మహిళలు కలిసి పాల్గొని ఉత్సాహంగా జండా ఎగరవేయడం జరుపుకున్నారు ఇందులో మహిళా మండలి భవనం యందు సీనియర్ సభ్యురాలు మరియు బిజెపి పార్టీ సీనియర్ నాయకురాలు బొడ్డు.చెన్నమ్మ ఆదిమల్ల.భారతమ్మ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు మహిళా మండల్ భవనం కమిటీ సీనియర్ నాయకురాలు మహిళా గ్రూప్ లీడర్ బొడ్డు నిర్మల మౌనిక మహిళా గ్రూప్ లీడర్ కే స్వర్ణలత కే గౌరీ తుంగ లక్ష్మి మరియు కాంగ్రెస్ సీనియర్ లీడర్ లీలావతి మరియు తదితరులు పాల్గొన్నారు

# గణతంత్ర దినోత్సవ వేడుకలు లో పాల్గొన్న నీరుడి కిరణ్ కుమార్ ముదిరాజ్

**- విద్యార్థులకు బహుమతుల ప్రదానం**



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయదుర్గంలోని శ్రీసత్య సాయి ప్రశాంతి స్కూల్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ యువగలం అధ్యక్షులు నీరుడి కిరణ్ కుమార్ ముదిరాజ్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని జాతీయ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు తో మంత్రపురి అభివృద్ధి.

**ఆయన లక్ష్యం నియోజవర్గ అభివృద్ధి**

**మంథనిలో రోడ్ల వెడల్పు...**

**ప్రయాణికుల రవాణాకు సుగమం**

**మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ..**

**అనేక అభివృద్ధి పనులు మంజూరు**

**హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు..**







మంథని ( ప్రశ్న న్యూస్) మంథని నియోజకవర్గంలో నీ ఒక్కప్పటి మంత్రపురి... నేడు మంథని గా పిలుచుకునే మంథని అభివృద్ధి పనులు షరా వేగంగా నడుస్తున్నాయి. మంథని నియోజకవర్గనికి 1000 కోట్లకు పైగా మంజూరు అయ్యి కొన్ని పనులు నిర్మాణంలో మరికొన్ని తుది దశకు కూడా చేరుకున్నాయి. అయితే ముఖ్యంగా మంథని కేంద్రం అయిన పట్టణం మంథని టౌన్ లో 100 కోట్లకు వరకు నిధులు మంజూరు అయ్యాయి. అందులో కుల సంఘాలకు భవనాలు ఇటీవల మంత్రి శంకుస్థాపనలు కూడా చేశారు.ఇంతకు ముందు టౌన్ లో మంజూరు చేసిన పనులు నిర్మాణంలో ఉన్నాయి. కొన్ని పనులు కూడా పూర్తి అయ్యాయి. మేడారం జాతర దృష్ట్యా వాహనదారులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మంథని - పెద్దపల్లి వెళ్ళే ప్రధాన రహదారి అయిన సూరయ్యపల్లి నుండి కూచిరాజ్ పల్లి వరకు రోడ్డు వేల్పు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో పాటు సెంట్రల్ లైటింగ్ లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ప్రధాన రహదారి మంథని కాటారం వెళ్లే రోడ్డు కూడా వెడెల్పు పనులు కూడా చేస్తున్నారు. మంత్రి శ్రీధర్ బాబు చొరవతో రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగుతున్నాయి. ఇవే కాక మంథని నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులకు నిధుల మంజూరుకు మంత్రి శ్రీధర్ బాబు ఇప్పటికే వెచ్చించారు. దీంతో మంథని అభివృద్ధి పరంగా ముందు ఉండనుంది. అయితే మంథని నియోజకవర్గం అభివృద్ధి మంత్రి శ్రీధర్ బాబు లక్ష్యమని పలు మార్లు కూడా చెప్పడం జరిగింది. దీంతో మరిన్ని రోజుల్లో మంథని నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మంథని నియోజకవర్గం ప్రజలు తమ ఆశ భావం వ్యక్తం చేస్తున్నారు.

# అమరావతిలో ఘనంగా 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు

అమరావతి (ప్రశ్న న్యూస్ ) రాష్ట్ర స్థాయి 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను రాజధాని అమరావతి నేలపాడులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పెరేడ్?ను పరిశీలించి, తన సందేశాన్ని అందించారు. వేడుకల్లో ఇండియన్ ఆర్మీ, కర్నూలు ఏపీఎస్పీ సెకండ్ బెటాలియన్, సీఆర్పీఎఫ్, కేరళ రాష్ట్ర పోలీస్, విశాఖపట్టణం ఏపీఎస్పీ 16 వ బెటాలియన్, ఎన్సీసీ (బాయ్స్), ఎన్సీసీ (గరల్స్), ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ (బాయ్స్ అండ్ గరల్స్), భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ (బాయ్స్ అండ్ గరల్స్), యూత్ రెడ్ క్రాస్ (బాయ్స్) కంటింజెంట్స్ కవాతును నిర్వహించారు. కవాతులో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఇండియన్ ఆర్మీ కంటింజెంట్ కు మొదటి స్థానం, విశాఖపట్టణం ఏపీఎస్పీ 16 వ బెటాలియన్ కు రెండో స్థానం, కాన్సులేషన్ ప్రైజ్ గా కేరళ రాష్ట్ర పోలీస్ కంటింజెంట్ కు అందించారు. పెరేడ్ లో ప్రధానంగా బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్ ఆహుతులను అలరించాయి. పెరేడ్ కు మంగళగిరి ఏపీఎస్పీ బెటాలియన్ ఐజీపీ బీ. రాజకుమారి నోడల్ ఆఫీసర్ గాను, డీఐజీ డా. కె. ఫకీరప్ప కోఆర్డినేటింగ్ ఆఫీసర్ గాను వ్యవహరించారు. పెరేడ్ కమాండర్ గా జంగారెడ్డి గూడెం ఏపీఎస్పీ పరేడ్ కమాండర్ ఆర్. సుస్మిత, పెరేడ్ సెకండ్ ఇన్ కమాండ్ ఏపీఎస్పీ మొదటి ఐఆర్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ టీ.ఎన్. శ్రీనివాసరావు, పెరేడ్ అడ్జుటెంట్ కాకినాడ ఏపీఎస్పీ 3 వ బెటాలియన్ ఎం. శివరామకృష్ణ లు వ్యవహరించారు. రిపబ్లిక్ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దంపతులు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దంపతులు, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, హైకోర్టు న్యాయమూర్తులు, పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ జే. శ్యామలరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా,ఎస్పీ వకుల్ జిందాల్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు హాజరయ్యారు. అమరావతి రాజధానిలో నిర్వహించిన ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలు రాష్ట్ర ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబిస్తూ ఘనంగా ముగిశాయి.

**ఆకట్టుకున్న అలంకృత శకటాలు:**

77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అమరావతి రాజధానిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వేడుకల్లో వివిధ ప్రభుత్వ శాఖలు రూపొందించిన శకటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాంస్కృతిక వారసత్వం, సామాజిక అవగాహన అంశాలను ప్రతిబింబించేలా రూపొందించిన శకటాలు కనువిందు చేశాయి. శకటాల్లో వందేమాతరం-150 సంవత్సరాల ఇతివృత్తంగా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ శకటానికి ప్రథమ, మహిళా సంక్షేమమే చంద్రన్న ధ్యేయం తో రూపొందిన సెర్ప్ శకటానికి ద్వితీయ, పెట్టుబడుల ద్వారా ఉపాధి ఇతివృత్తంగా రూపొందిన పరిశ్రమల శాఖ శకటానికి తృతీయ స్థానాల్లో నిలిచాయి. శాఖల శకటాలు ప్రభుత్వ సంకల్పం, ప్రజా సంక్షేమ లక్ష్యాలను స్పష్టంగా ఆవిష్కరించాయి.



ఆధునిక సాంకేతికతతో పాటు సంప్రదాయ కళారూపాల మేళవింపుతో రూపొందిన శకటాలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# పరేడ్ మైదానంలో వైభవంగా గణతంత్ర దినోత్సవ సంబరాలు

**జాతీయ పతాకావిష్కరణతో ప్రారంభమైన గణతంత్ర వేడుకలు**

**నంద్యాల పరేడ్ మైదానంలో దేశభక్తి సందడి అలరించిన**

**శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు**



నంద్యాల ( ప్రశ్న న్యూస్) నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరేడ్ మైదానంలో 77వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్రీయ సెల్యూట్ స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి జిల్లాభివృద్ధిపై గణతంత్ర సందేశం అందించారు. 2025 రబీ సీజన్?లో సాధారణంగా సాగు చేయాల్సిన 1 లక్షా 73 వేల హెక్టార్లకు గాను, రైతులు ఇప్పటివరకు 1 లక్షా 76 వేల హెక్టార్లలో వివిధ పంటలను సాగు చేశారని తెలిపారు. అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం ద్వారా జిల్లాలోని 2,06,052 మంది రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు రూ.280 కోట్లను జమ చేసినట్లు పేర్కొన్నారు. 2025 రబీ సీజన్‌లో బ్యాంకుల ద్వారా 1,25,650 మంది రైతులకు రూ.1,920 కోట్ల మేర పంట రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల ప్లాటూన్లు క్రమశిక్షణతో మార్చ్‌పాస్ట్ నిర్వహించాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఉప్పర వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సురేష్ కుమార్, సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ సభ్యులు నరహరి విశ్వనాథ రెడ్డి, ఎంపీపీ శెట్టి ప్రభాకర్, జిల్లా స్థాయి అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, పోలీసు సిబ్బంది, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# 77వ గణతంత్ర దినోత్సవం వేడుకలలో తుంగ తిరుపతి



నాచారం (ప్రశ్న న్యూస్) నాచారం విలేజ్ కార్యాలయంలో నిర్వహించిన జాతీయ పతాక ఆవిష్కరణ తుంగ తిరుపతి మాజీ కౌన్సిలర్ఊ మైనార్టీ పెద్దలు గఫూర్ సాబ్ లు ఎగరవేసినారు. ఈ యొక్క గణతంత్ర దినోత్సవ వేడుకల్లో తుంగ తిరుపతి (మాజీకౌన్సిలర్) మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు రాజ్యాంగ స్పూర్తితో ప్రజల అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు సాగుదాం అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను గుర్తు చేసారు.

ఈ గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న నాచారం విలేజ్ మజీద్ అధ్యక్షులు మరియు, కరీంసాబ్, కనకరావు మద్రాస్ ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్ని జయప్రదం చేసారు.

## 77వ గణతంత్ర దినోత్సవం జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



గుంటూరు (ప్రశ్న న్యూస్) 77వ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గుంటూరు జిల్లా ప్రజలందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు . దేశ స్వాతంత్ర్యం కోసం ఎనలేని త్యాగాలు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ కి, అమరవీరులైన అనేకమంది మహనీయులకు ఈ సందర్భంగా నా వినమ్ర జోహార్లు. గుంటూరు జిల్లాకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన అపూర్వ త్యాగాలు, సేవలు చిరస్మరణీయమైనవి. వారికి ఈ శుభదినాన ఘన నివాళులు తెలియజేశారు. ఎందరో మహనీయులు, మేధావుల కృషి ఫలితంగా భారత రాజ్యాంగం రూపుదిద్దుకొని, 1950 జనవరి 26వ తేదీ నుండి అమలులోకి వచ్చింది. ఈ శుభదినమున మన దేశం ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద, సార్వభౌమ గణతంత్ర రాజ్యంగా అవతరించింది. భారత రాజ్యాంగ రూపకర్త డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ని స్మరించుకొని నివాళులర్పించడం మనందరి కర్తవ్యం. కార్యక్రమంలో ఎమ్మెల్యే గల్లా మాధవి, డా.బూర్ల రామాంజనేయులు పత్తిపాడు ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా అటవీ అధికారి హిమ శైలజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి.జ్యోతి బసు ఇతర జిల్లా అధికారులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి తన వంతున పదివేల రూపాయలను అందించిన

### కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో సోమవారం నాడు ప్రాథమిక పాఠశాలల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొని పాఠశాల అభివృద్ధికి తన వంతున పదవేల రూపాయలను కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ తిరునగరి గోదావరి వెంకటరాములు నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, మరియు గ్రామ సర్పంచ్ స్వప్న ఉషయ్య ఆధ్వర్యంలో పదవేల రూపాయలను అందజేయడం జరిగింది ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ గోదావరి మాట్లాడుతూ పాఠశాల కు సంబంధించిన విద్యార్థి విద్యార్థులకు తన వంతు సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని మరియు విద్యార్థులకు ఏ సమస్య ఉన్నా గానీ తమ దృష్టికి తీసుకువస్తే తమకు తోచిన సహాయాన్ని అందిస్తానని కిష్టాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గోదావరి తెలిపారు తదుపరి పాఠశాలకు పదవేల రూపాయలు నగదును అందించిన గోదావరి మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందంతో శాలువతో ఘనంగా సత్కరించారు.

## రామాయంపేట కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్.

### కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జొన్నల బాలకృష్ణ (బాలు)బిఆర్ఎస్ పార్టీలో చేరిక.

### కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి హరీష్.



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు సమక్షంలో మెదక్ బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు యం. పద్మ దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రామాయంపేట మున్సిపాలిటీ చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జొన్నల బాలు గత కొంత కాలంగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నరు.రామాయంపేట అభివృధి కోసం జొన్నల బాలు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు సమక్షంలో పార్టీలో చేరారు..ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగర వేస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు.. పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి,మాజీ మున్సిపల్ పల్లె జితేందర్ గౌడ్,మాజీ పిఎసిఎస్ చైర్మన్ బాదే. చంద్రం, నాయకులు పుట్టి.యాదగిరి, కన్నాపురం.కృష్ణ గౌడ్, ఉమా మహేశ్వర్,అస్మద్దీన్,బాసం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కిష్టాపూర్ గ్రామంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

### గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) కొల్చారం మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు సంస్కృతిక, నృత్యాలు కార్యక్రమాలు నిర్వహించి అందర్నీ ఆకట్టుకునే విధంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఊశయ్య పాల్గొన్నారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ స్వప్న ఉషయ్య మాట్లాడుతూ భారతదేశం గణతంత్ర దేశముగా ఏర్పడి నేటికి 76 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భముగా స్వాతంత్ర సమరయోధులకు, మరియు పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థిని విద్యార్థులకు, శుభాకాంక్షలు తెలియజేశారు మరియు 77వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు. తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగఫలంగా సిద్ధించిన స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలని డాஎం బాబా సాహెబ్ అంబేద్కర్ ఆధ్వర్యంలో ప్రపంచంలోనే పెద్దదైన, గొప్పదైన భారత రాజ్యాంగాన్ని రచించి 26-01-1950 రోజున మనకు అందించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాతలైన ఆ మహానీయులను గుర్తుచేసుకొనుట మన భాద్యత. అని గుర్తు చేశారు.తెలంగాణా రాష్ట్ర సాధనలో ఎందరో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి రాష్ట్ర సాధన కోసం పోరాడి అమరులైనారు, వారి త్యాగాలను ఈ రాష్ట్రము ఎప్పటికి మరువదు. అని గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య తెలిపారు తదుపరి గ్రామ యువకులు యువజన నాయకులు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు బాగా చదివి గ్రామానికి మరియు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులు సంస్కృత సంప్రదాయాలు కాకుండా క్రీడాల్లో రాణించి జిల్లా రాష్ట్ర స్థాయిలో పాల్గొని పాఠశాలకు మరియు మంచి పేరు తీసుకురావాలని గ్రామ యువజన నాయకులు విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాదుల స్వప్న ఉశయ్య, ఉప సర్పంచ్ చందపురం నిర్మల శేఖర్, మాజీ సర్పంచ్ తిరునగరి



గోదావరి, వార్డు మెంబర్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయురాలు, అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్, గ్రామ ప్రజలు గ్రామ యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సింగిల్ విండో కార్యాలయంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

### -జెండా ఆవిష్కరించిన సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్

మంచని ( ప్రశ్న న్యూస్) మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో సంఘ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించినారు. స్వాత్రంత్ర్యం కోసం అమరులైన వారి త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఏంసి చైర్మన్ కుడుదుల వెంకన్న, సంఘ మాజీ చైర్మన్ కొత్త శ్రీనివాస్, టీజీఈఆర్సి సలహాదారు శశిభూషణ్ కాచే, తెలంగాణ హైకోర్టు అడ్వకేట్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇనుముల సతీష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయిలి ప్రసాద్, సంఘ మాజీ డైరెక్టర్లు మాచిరాజు గౌడ్, ఆకుల రాజబాబు, మాజీ ఎంపీపీ కొండ శంకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకుల కిరణ్, మాజీ జెడ్పిటిసి మూల సరోజన పురుషోత్తం రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వోడ్నాల శ్రీనివాస్, పట్టణ యూత్ అధ్యక్షులు సాదుల శ్రీకాంత్, నాయకులు గోటికార్ కిషన్, గుండా పాపారావు, లైశెట్టి రాజు, రామడుగు మారుతి,బెజ్జంకి డిగంబర్, పర్వవేణీ మోహన్, ఆకుల శ్రీనివాస్, అంకుష్, సమ్మయ్య, తగరం శంకర్ లాల్, ఎగోలపు శంకర్ గౌడ్, నక్క నాగేంద్ర, మెడగొని రాజమౌళి గౌడ్, నరోత్తం రెడ్డి, పెద్ద సంఖ్యలో



నాయకులు, రైతులు సంఘ సభ్యులు, సంఘ సిబ్బంది పాల్గొన్నారు.

### సహకార బ్యాంకులో ఘనంగా గణతంత్ర వేడుకలు

ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మంథని బ్రాంచ్ లో మేనేజర్ కె.ఉదయశ్రీ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్లు దుమ్మని లక్ష్మణ్, మాచిడి శ్రీనివాస్,



డిఈ సందేబోయిన శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్లు వసంత, జాకీర్,గంట సతీష్, స్టాఫ్ అసిస్టెంట్లు మహేందర్, మహేశ్వరి,

## కాప్రా ప్రెస్ క్లబ్ వద్ద ఘనంగా 77వ ఘనతంత్ర దినోత్సవ వేడుకలు



కాప్రా (ప్రశ్నన్యూస్ )కాప్రా ప్రెస్ క్లబ్ వద్ద 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కుషాయిగూడ ఏసీపీ వై.వెంకటరెడ్డి, ఇన్స్పెక్టర్ ఎల్. భాస్కర్ రెడ్డి, ఎస్సై సాయి తదితరులు పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, కోశాధికారి రుద్రగోని నర్సింగ్ గౌడ్, ఉపాధ్యక్షులు అదిమూలం శ్రీనివాస్, వట్టిపల్లి సురేష్, నటరాజ్ , సీనియర్ జర్నలిస్టులు, సలహాదారులు లయన్ వడ్లోజు జ్యోతిర్మయ చారి, కేసరి సహదేవ చారి, కేసి మోహన్,ఎం.చంద్రమౌళి,శనిగరం అశోక్,కే.సత్యనారా యన, గడ్డమీదీ బాలరాజు,కీర శ్రీనివాస్, జర్నలిస్టులు దామెరపల్లి నర్సింహ రెడ్డి,లక్కిడి బాల్ రెడ్డి, శ్రీనివాస్, బసంత్ రెడ్డి, దాచారం రమేష్, ప్రభాకర్ రెడ్డి, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

### రెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ పద్మ అశోక్ గౌడ్

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) నర్సాపూర్ మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ పథకాన్ని ఆవిష్కరించిన రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ పద్మ అశోక్ గౌడ్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 77వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతదేశానికి రాజ్యాంగం అమలులోకి వచ్చిన ఈ రోజు ప్రతి భారత పౌరుడికి గర్వకారణమని అన్నారు. రాజ్యాంగ విలువలు, ఆశయాలకు కట్టుబడి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని గ్రామ సర్పంచ్ పద్మ అశోక్ గౌడ్ తెలిపారు పాఠశాలకు సంబంధించిన సౌండ్ బాక్స్, మరియు విద్యార్థి విద్యార్థులకు నాలుగు వాలీబాల్ కిట్టులను బహుమతిగా అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వార్డ్ సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

### పాల్గొన్న 1994 బ్యాచ్ పూర్వ విద్యార్థినీలు



మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి గణతంత్ర దినోత్సవాన్ని జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాలలో వివిధ సంవత్సరాల్లో చదువుకున్న వేలాది మంది పూర్వ విద్యార్థిలు హాజరై పాత



జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ విద్యార్థులతో కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఒక్కచోట చేరడంతో పాఠశాల ప్రాంగణం భావోద్వేగ వాతావరణంతో నిండిపోయింది. గురు శిష్యుల అనుబంధానికి నిదర్శనంగా నిలిచిన ఈ సమ్మేళనం అందరిలో చిరస్మరణీయంగా మిగిలిందని పాల్గొన్నవారు తెలిపారు.1994 బ్యాచ్ సంబందించిన విద్యార్థినిలుజయ లక్ష్మీ ,పద్మ లత, మంజుల, విజయలక్ష్మి, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం ప్రజలతో చెలగాటం

## ఆగని పోరాటం:ఎమ్మెల్యే శ్రీ గణేష్

- కంటోన్మెంట్ ప్రజల గోడు ఎంపీ ఈటలకు పట్టదా.?
- ఆటలు కట్టిపెట్టి ఈటల నోరు విప్పాలి:ఎమ్మెల్యే శ్రీ గణేష్
- వారం రోజులుగా రిలే నిరాహారదీక్ష,నిన్న రిపబ్లిక్ డే
- రోజున కూడా కంటోన్మెంట్‌కి రాని ఎంపీ మనకెందుకు.: ఎమ్మెల్యే
- కేంద్రంలోని బిజేపీ ప్రభుత్వానికి కంటోన్మెంట్ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే నామినేటెడ్ వ్యవస్థను రద్దు చేసి వెంటనే బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలి :ఎమ్మెల్యే శ్రీ గణేష్
- 7 వ రోజు రిలే నిరహార దీక్షలో ప్రొఫెసర్ కోదండరాం,జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ సంఘీభావం







కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) దేశం మొత్తం "77"వ గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.కానీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో మాత్రం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ గత ఏడు రోజులుగా "రిలే నిరాహారదీక్ష"చేపడుతున్న విషయం తెలిసిందే! అయితే ఆయన మాత్రం భిన్నంగా "రిపబ్లిక్ డే"దినోత్సవం జరుపుకున్నారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలో ఏ కాలనీ,బస్తీలు పర్యటించ కుండా దీక్ష శిబిరం వద్దే "77" వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.అలాగే ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ దేశం మొత్తం 77 వ గణతంత్ర వేడుకలు సంబరాలు అంబరాన్ని తాకేలా జరుపుకున్నారు.కానీ మా సికింద్రాబాద్ కంటోన్మెంట్ విలీనం అంశం గత వారం రోజులుగా రిలే నిరాహారదీక్ష చేపట్టినప్పటికీ స్థానిక ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు.వారి సంఘీభావం తెలిపారు.కానీ భాజపా నేత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాత్రం గత కొన్ని రోజులుగా వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ,నిన్న రిపబ్లిక్ డే సందర్భంగా కూడా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో గణతంత్ర వేడుకల్లో పాల్గొన కుండా ముఖం చాటేస్తున్నారని, అసలు ఆయన ఆలోచన ఏమిటో కూడా చెప్పట్లేదని, స్థానిక ప్రజల సమస్యలు కేంద్రానికి తెలియాలంటే కేవలం మల్కాజిగిరి ఎంపీ ఈటల పై బాధ్యత ఉందన్నారు.దాన్ని విస్మరించి మల్కాజిగిరి ఎంపీ నియోజకవర్గంలో కంటోన్మెంట్ ని వదిలి మిగితా నియోజకవర్గాల్లో పర్యటించడం ఆయన అసమర్థత ఏమిటో అర్థం అవుతుందని ఎమ్మెల్యే శ్రీ గణేష్ పేర్కొన్నారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో సుమారు 5 లక్షల మంది నివసిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాటిలో కేవలం 2 లక్షల 57వేల మంది మాత్రమే ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.ఇంత పెద్ద జనాభా ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పై మాట్లాడ కుండా "నామినేటెడ్ వ్యవస్థ"ద్వారా పరిపాలన అందిస్తున్నట్లు చెప్పి చేతులు దులుపుకోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తంచేశారు.మరో విషయం ఏమిటంటే స్థానికంగా మౌళిక సదుపాయాల కల్పనలో బోర్డు పూర్తిస్థాయిలో విఫలమైంది.అలాగే అభివృద్ధి కుంటుపడింది.రాష్ట్ర పెత్తనం బోర్డు పరిధిలో ఉండదు కాబట్టి "మేర్జ్ ప్రక్రియను"తన భుజాలపై వేసుకుని రిలే నిరాహారదీక్ష చేపట్టినప్పటికీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పందించకపోవడం గమనార్హం.ఏదేమైనా కంటోన్మెంట్ ప్రాంత ప్రజలు అన్ని గమనిస్తున్నారు.

### దీక్ష శిబిరం వద్ద ప్రముఖుల తాకిడి..

కేంద్ర ప్రభుత్వ కబంధ హస్తాల నుంచి కంటోన్మెంట్ ప్రాంత ప్రజలకు విముక్తి కల్పించాలని,నామినేటెడ్ వ్యవస్థను రద్దుచేసి వెంటనే కంటోన్మెంట్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలనే డిమాండ్ తో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కార్ఖానా లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గత 6 రోజులుగా చేస్తున్న రిలే నిరహార దీక్ష సోమవారం ఏడవ రోజుకు చేరింది. సోమవారం 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా దీక్షా శిబిరం వద్దే కంటోన్మెంట్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు,కంటోన్మెంట్ విలీనం కోసం పోరాడుతున్న శ్రేణులతో కలిసి జాతీయ జెండాను ఎగురవేసి ఎమ్మెల్యే దీక్షను ప్రారంభించారు.ఈ దీక్షా శిబిరానికి తెలంగాణ జన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు,తెలంగాణ ఉద్యమ నేత,ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం రెడ్డి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్,సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ ఆడెం సంతోష్,టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం,లోక్ సత్తా పార్టీ జాతీయ అధ్యక్షులు జయ ప్రకాష్ నారాయణ సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ తమ నాయకులతో కలిసి దీక్షా శిబిరానికి వచ్చి ఎమ్మెల్యే శ్రీగణేష్ చేస్తున్న దీక్షకు సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం వారి సందేశాన్ని అందించారు.ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ ఈటెల రాజేందర్ కంటోన్మెంట్ ప్రాంతం పై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు.ఈటెలకి కంటోన్మెంట్ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే నేరుగా దీక్షా శిబిరానికి వచ్చి నాతో పాటు కూర్చొని కంటోన్మెంట్ బోర్డు విలీనం పై బహిరంగంగా చర్చించాలని డిమాండ్ చేశారు.విలీనం చేస్తానంటే ఎవరు వద్దన్నారని మాట్లాడటం వారి అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని అన్నారు.ఎంపికేంద్ర ప్రభుత్వంలో భాగం అని మరచి పోయి మాట్లాడటం కంటోన్మెంట్ ప్రజల దౌర్భాగ్యమని గుర్తు చేశారు.ప్రొఫెసర్ కోదండరామ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే కంటోన్మెంట్ ప్రాంతాన్ని వెంటనే రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలి డిమాండ్ చేశారు.ఈరోజు హైదరాబాద్ నగరం నలుమూలల విస్తరించి ప్రపంచంలోనే నెంబర్ వన్ నగరంగా నిలిచింది.కానీ కంటోన్మెంట్ ప్రాంత ప్రజలు అభివృద్ధికి నోచుకోలేదు, రక్షణ మంత్రిత్వ శాఖ ముఖ్య కారణం అది కాక ఇక్కడి చట్టాలే.ఏ అభివృద్ధి పని చేయాలన్నా కంటోన్మెంట్ బోర్డు రక్షణ శాఖను బూచిగా చూపి అభివృద్ధి నిరోధకులుగా మారుతుంది.రక్షణ అధికారులకు కేంద్ర ప్రభుత్వం సేవలు చేయడాన్ని ఎవ్వరూ వ్యతిరేకించరు.కానీఈ దేశంలో నివసించే ప్రతి ఒక్కరూ దేశ రక్షణకు తమ ప్రాణాలను అడ్డు వేసి పోరాడుతున్న సైనికులకు సేవలు చేస్తారు.కానీ మేము అడిగేది ఇక్కడ నివసిస్తున్న ప్రజల గురించే, స్థానిక ప్రజలు ఇల్లు కట్టుకోవాలన్నా అనుమతుల కోసం ఎన్నో ఇబ్బందులకు గురికావాల్సి పరిస్థితి నెలకొంది.రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఎన్ఓసీల పేరుతో కాలయాపన చేస్తూ కంటోన్మెంట్ ప్రాంత అభివృద్ధికి కంటోన్మెంట్ బోర్డు అడ్డు తగులుతుంది.ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా,ఇక్కడి ప్రజలు నగరంలోని మిగతా ప్రాంతాల ప్రజల లాగా మంచి జీవితం గడపాలన్నా విలీనం ఒకటే మార్గం.అందుకని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం భేషజాలకు పోకుండా ఇక్కడి ప్రజల మనోభావాలను గుర్తించి, వారి అభివృద్ధికి సహకరించి కంటోన్మెంట్ బోర్డును వెంటనే రాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనం చేయాలి ఆయన కోరారు.జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ప్రజలు నానారకాలుగా నరకయాతన అనుభవిస్తున్న విషయం వాస్తవమే,కానీ స్థానిక పౌరుల సాధకబాధకాలు పరిగణనలోకి తీసుకుని వీలైనంత త్వరగా జిహెచ్ఎంసి లో విలీనం చేస్తే అన్ని సమస్యలు దూరమవుతాయని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్ బద్రీనాథ్ యాదవ్ సంతోష్ యాదవ్ రాజేష్ యాదవ్ మురళీ ముదిరాజ్ బోయిన్ పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు శరత్ కుమార్, ప్రభాకర్,రవి, బాల్ రాజ్,నాగినేని సరిత తదితరులు పాల్గొన్నారు.

# సేవే జీవన లక్ష్యం దిశగా పని చేస్తా

- ప్రముఖ కళాకారుడు, సామాజిక సేవా కార్యకర్త : వారాల దేవయ్య - గణతంత్ర దినోత్సవ వేడుకల్లో వారాల దేవయ్యకు జిల్లా స్థాయి గుర్తింపు
- సామాజిక సేవ - కళా రంగాల్లో విశిష్ట సేవలందించిన దేవయ్య - జిల్లా కలెక్టర్ చేతులమీదుగా "విశిష్ట సేవా పతకం" అందజేత






**వేములవాడ (ప్రశ్న న్యూస్)** గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో, సమాజ సేవ,ఆధ్యాత్మిక సేవ, కళారంగం,విపత్తు సహాయక సేవలలో విశేష కృషి చేసిన రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన ప్రముఖ కళాకారుడు, సామాజిక సేవా కార్యకర్త వారాల దేవయ్యను సోమవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విశిష్ట సేవా ప్రశంసా పత్రంతో సత్కరించారు.మూల మానేరుల సంగమంగా పేరుగాంచిన దక్షిణ కాశీ వేములవాడలో, 36 సంవత్సరాల క్రితం చిన్న మందిరంతో శ్రీ షిరిడి సాయిబాబా సేవా ప్రయాణాన్ని ప్రారంభించిన వారాల దేవయ్య, సేవనే తన జీవిత లక్ష్యంగా మార్చుకున్నారు. దాతలతో మమేకమై సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో లక్షలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తూ సమాజానికి సేవా మార్గదర్శిగా నిలిచారు.సాయి మందిర అభివృద్ధి మాత్రమే కాకుండా, ప్రకృతి విపత్తుల సమయంలో హ్యామ్ రేడియో ద్వారా ప్రజలకు సమాచార, సహాయక సేవలు అందిస్తూ మానవీయ విలువలకు ప్రతీకగా నిలిచారు. రెడ్ క్రాస్ సొసైటీ వేములవాడ నియోజకవర్గ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ అనేక మంది అభాగ్యులకు అండగా నిలిచారు. తిరుమల తిరుపతి దేవస్థానం కరీంనగర్ జిల్లా డిపిపి సభ్యునిగా ఆధ్యాత్మిక రంగంలోనూ సేవలు అందించారు.కళా రంగంలోనూ వారాల దేవయ్య ప్రత్యేక గుర్తింపు సాధించారు. రంగస్థలంపై సత్య హరిచంద్ర, సీతారామ కళ్యాణం వంటి నాటకాలలో నటించి ప్రేక్షకులను అలరించారు. కరోనా మహమ్మారి సమయంలో ప్రజలను అప్రమత్తం చేసే లక్ష్యంతో అనేక సామాజిక అవగాహన ప్రదర్శనలు ఇచ్చారు. చిన్న తెరపై వందలాది సినిమాల్లో నటించడంతో పాటు, వెండితెరపై గేమ్ చేంజర్, మారెమ్మ వంటి చిత్రాల్లో నటించి బంగారు నంది అవార్డు అందుకోవడం విశేషం. వ్యక్తిగత జీవనంలో ఆదర్శ రైతుగా గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా వారాల దేవయ్య మాట్లాడుతూ,"ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను గుర్తుచేస్తోంది. ఇది నా ఒక్కరి కృషికి వచ్చిన గుర్తింపు కాదు. నన్ను నమ్మి అడుగడుగునా తోడుగా నిలిచిన భక్తులు, దాతలు, సాయి సేవా సంస్థ సభ్యులు, రెడ్ క్రాస్ కార్యకర్తలు, కళా రంగ మిత్రులందరికీ దక్కిన గౌరవం. సేవే నా జీవన మార్గం. చివరి శ్వాస వరకు సమాజ సేవలోనే కొనసాగుతాను" అని భావోద్వేగంగా తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లాలోని పలువురు ప్రముఖులు వారాల దేవయ్యకు అభినందనలు తెలియజేశారు.

# 8వ వార్డు భారతీయ జనతా పార్టీ అభ్యర్థికి ఒక అవకాశం ఇవ్వండి

- అభివృద్ధి అంటే ఏంటో చూపిస్తాం.
- ఎడ్ల మౌనికను మీ ఇంటి బిడ్డగా ఆదరించండి.

**మంథని ( ప్రశ్న న్యూస్)** మంథని మున్సిపల్ పరిధిలో కాంగ్రెస్ టిఆర్ఎస్ నాయకులకు ఓట్లు వేసి మోసపోయింది ఇక చాలు 8వ వార్డు లో ముందస్తు ప్రచారం నిర్వహించిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఎడ్ల మౌనిక సాగర్ గడపగడపకు వెళ్లి ప్రతి ఇంటి తలుపు తడుతూ.ప్రజల సమస్యలు వింటూ ముందుకు సాగుతూ ముందస్తు ప్రచారం నిర్వహించిన భారతీయ జనతా పార్టీ అభ్యర్థి పార్టీ శ్రేణులు ఒ వార్డు ప్రజలు 8 వవార్డు ను అభివృద్ధి చేసి చూపించే బాధ్యతను భుజాలపై వేసుకుని నిజాయితీగా, నిబద్ధతతో పని చేసే నాయకురాలు ఎడ్ల మౌనిక సాగర్ గారి కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి గెలిపించండి అంటూ అభ్యర్థించారు మీ ఓటుతో 8 వ వార్డు అభివృద్ధికి బాట వేయండి మీ ఆశీర్వాదంతో 8 వ వార్డు ను ముందుకు నడిపిస్తాం అంటూ ఈసారి జరిగే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి అవకాశం ఇవ్వాలని ఇంటింటికి తిరుగుతూ ముందస్తు ప్రచారం నిర్వహించారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కొండపాక సత్య ప్రకాష్ మంథని పట్టణ అధ్యక్షులు సబ్బని సంతోష్ సీనియర్ నాయకులు బూడిద



తిరుపతి నార మల్ల కృష్ణ ఎడ్ల సదాశివ గుడ్ల గురువేష్ దూడపాక రోజా తాడూరి రవి తదితరులు పాల్గొ న్నారు.

## విరాట్ నగర్ కాలనీ నూతన అధ్యక్షుడి ఎన్నిక



కాప్రా (ప్రశ్న న్యూస్) కుషాయిగూడ జమ్మిగడ్డలోని శ్రీ విరాట్ నగర్ కాలనీ నూతన అధ్యక్షుడిగా మరోసారి నమిలే మహేష్ ను కాలనీ వాసులు అందరు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గడిచిన రెండు సంవత్సరాలు కాలనీ బాగోగుల కోసం అవర్నిశలు పని చేయడంతో కాలనీ వాసులు అర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పజ్జురి పావని మహిపాల్ రెడ్డి పాల్గొని మహేష్ ను షాలువాతో సత్కరించి అభినందలు తెలియజేశారు.

## రాజ్యాంగం కల్పించిన హక్కులు సద్వినియోగం చేసుకోవాలి :డాక్టర్. రాజేశం





అమీర్ పేట్ ( ప్రశ్న న్యూస్) రాజ్యాంగం కల్పించిన హక్కులను సద్వినియోగం చేసుకుంటు తమ భాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని రాష్ట్ర క్షయ నియంత్రణధికారి, రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ ఏ. రాజేశం సూచించారు. 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా సోమవారం నాడు రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తు రాజ్యాంగం భారతదేశ అత్యున్నత చట్టమని, ఇది ప్రజాస్వామ్య, సార్వభౌమ, లౌకిక, సామ్యవాద గణతంత్ర దేశంగా భారతదేశాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దుతుందని అన్నారు. అలాగే ఈ రాజ్యాంగం, పౌరుల ప్రాథమిక హక్కులు, బాధ్యతలు, ప్రభుత్వ నిర్మాణాన్ని రూపొందిస్తుదని పేర్కొన్నారు. ఇక ఇటీవల జరిగిన లాబ్ టెక్నీషియన్ ల నియామకాల్లో రాష్ట్ర క్షయ శిక్షణ కేంద్రంలో ఉన్న మూడు లాబ్ టెక్నీషియన్ (గ్రేడ్ 2) ఖాళీలలో నియామకమైన లాబ్ టెక్నీషియన్లు శ్రవంతి, ఎస్తేర్ రాణి, జావీదా బేగం తో పాటు డిటిసి లో లాబ్ టెక్నీషియన్ గా నియామకమైన మాధవి లను అభినందించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్. చల్లాదేవి, డాక్టర్. ప్రసిద్ధ, డాక్టర్ సత్యరత్న, డాక్టర్. నవీన్ కుమార్, డాక్టర్. దీప్తి, ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతినిధి డాక్టర్. మహేశ్, రవికుమార్ సంతోజు, ప్రకాశ్ రెడ్డి, ప్రవీణ్, లతీఫ్, ఫారుక్, ఇలియాస్, శ్రీనివాస, హరిక, రాధిక, మహబుబ్ అలీ, యాసిన్, ఖాదర్, అనురాధ, స్వప్న తదితరులు పాల్గోన్నారు.

## రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ పాటించాలి

- బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ : పెంచాల సౌమ్య - మహేష్
- జాతీయ జెండాను ఆవిష్కరించిన సర్పంచ్ సౌమ్య



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పెంచాల సౌమ్య -- మహేష్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులు, బాధ్యతలను ప్రతి ఒక్కరూ గుర్తించాలి. గ్రామాభివృద్ధికి ఐక్యతతో ముందుకు సాగాలి. విద్య, పరిశుభ్రత, సంక్షేమ పథకాల అమలులో బూరుగుపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుందాం" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, వార్డు సభ్యులు అక్కరాజు చంద్రయ్య, మ్యాన వర్షిత, వెంకటేష్, అతికం రాజశేఖర్ గౌడ్, కొలుపుల మల్లేశం, కల్లెపల్లి మమత, బరిగే రాధా రమేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్తో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## యువత క్రీడా రంగంలో రాణించాలి

- బొల్లారం టీమ్ విజయానికి గర్వకారణం
- బొల్లారం మాజీ సర్పంచ్ : ఇరువాల మల్లేశం



వేములవాడ (ప్రశ్న న్యూస్)రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట గ్రామంలో ఇటీవల నిర్వహించిన కబడ్డీ పోటీల్లో విజయం సాధించిన బొల్లారం టీం సభ్యులను గ్రామ మాజీ సర్పంచ్ ఇరువాల మల్లేశం సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఇరువాల మల్లేశం మాట్లాడుతూ, గ్రామీణ క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యతతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కబడ్డీ వంటి సంప్రదాయ క్రీడల్లో యువత రాణించడం గ్రామానికి గర్వకారణమని, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయిలో పోటీల్లో పాల్గొని మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు.

# మేడారం సమ్మక్క సారక్క స్ఫూర్తితో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం ఉద్యమిస్తాం

**కల్లు గీత కార్మిక సంఘం నూతన సంవత్సర 2026 క్యాలెండర్ ఆవిష్కరణ**



ములుగు(ప్రశ్న న్యూస్) జిల్లా కేంద్రంలోని కల్లుగీత కార్మిక సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ పులి నర్సయ్య గౌడ్ లు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ఉయ్యాల మధుకర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముఖ్య అతిధిగా హాజరైన గుండె బోయిన రవిగౌడ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ కల్లుగీత కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కొరకు సమ్మక్క సారక్క పోరాటాల స్ఫూర్తితో ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటినా కూడా కల్లుగీత కార్మిక సమస్యల మీద ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమైన విషయం అన్నారు. 50 సంవత్సరాలు నిండిన కల్లు గీత కార్మికులందరికీ పెన్షన్ సైట్ ఓపెన్ చేసి వృత్తి పింఛన్ అందరికీ ఇవ్వాలని టూవీలర్ బైకులు వెంటనే ఇవ్వాలని ఏజెన్సీ ఏరియాలో రద్దయిన సొసైటీలను ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి పునరుద్ధరణ చేసి కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని కోరారు. ములుగు జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలని జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు పెట్టాలని జిల్లా కేంద్రంలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బుర్ర జనార్దన్ వత్సవాయి సారయ్య గౌడ్ గాజుల ఈశ్వర్ గౌడ్ బొనగాని శ్యాంసుందర్ గౌడ్. అనిల్ హెల్త్ కేర్ హాస్పిటల్ డాక్టర్ అనిల్ కుమార్ గౌడ్ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ పైడిమల్ల మౌనిక గౌడ్, మంద రమేష్ గౌడ్, గుండెబోయిన శ్రీనివాస్ గౌడ్, శ్రీపతి రాకేష్ గౌడ్, గోపగాని రాజు గౌడ్, గుండె బోయిన ప్రకాష్, రాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డే వేడుకల్లో భాజపా నేత ఏనుగుల తిరుపతి




కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కూకుట్పల్లీ నియోజకవర్గంలో ఉన్న ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లో బిజెపి సీనియర్ నాయకులు ఏనుగుల తిరుపతి పార్టీ కార్యాలయం ముందు “77”వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.అనంతరం హెచ్ ఏ ఎల్ పార్క్ ,హరిజన బస్తీ ,అంజయ్య నగర్ పలు ప్రాంతాల్లో జాతీయ జెండాను ఎగురవేసి జాతీయ స్వాతంత్ర్య సమరయోధులను, అమర వీరులను స్మరించుకుంటూ వారి త్యాగాలను నెమరవేసుకున్నారు. అలాగేవారికి నివాళులు అర్పిస్తూ రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకుంటూ వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ రాజ్యాంగ ఫలాలను చిట్ట చివరి ప్రతి భారతీయునికి అందే విధంగా కేంద్రం సాహసోపేతమైన కారి క్రమాలు నిర్వహిస్తున్నారు.

డివిజన్ లో ప్రతి ఒక్కరికీ గణతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే అంజయ్య నగర్లో ఉన్న దర్శన్ పాఠశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు గణతంత్ర వేడుకల్లో పాల్గొని విద్యార్థులకు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చిన్నారులకు మెమొంటోలు, సర్టిఫికెట్స్ అందజేశారు. ఈకార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సత్యమూర్తి, వేణుగోపాల్ రెడ్డి, శేఖర్, అంజన్న, వెంకటేష్, రమేష్, హర్జీత్ సింగ్, సందీప్, అశోక్, మల్లేష్, రాజు, వరుణ్, సంపత్, అరుణ్ ,శ్రీకాంత్, నర్సింహా ,ప్రమోద్, మల్లికార్జున్, బబ్లు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

**జాతీయ జెండాను ఆవిష్కరించిన ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ శాఖలపై ప్రసంగం**

**ఆకట్టుకున్న విద్యార్థులు నృత్యాలు**




సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) గణతంత్ర దినోత్సవ వేడుకలను జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా క్యాంప్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముందుగా పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అక్కడి నుంచి నేరుగా జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ ల నుంచి గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. దేశ భక్తి గీతాలపై విద్యార్థుల నృత్యాల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రజల సమస్యల పరిష్కారమే ముఖ్యమైన ఏకైక లక్ష్యంతో నేను మరియు నా జిల్లా యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తున్నాము. జిల్లాలోని వివిధ శాఖల ద్వారా నిరంతరంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నాం.

ఇందుకు కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అభినందనలు. గణతంత్ర వేడుకల సందర్భంగా మీ అందరికీ మరోసారి శుభాకాంక్షలు తెలుపుతూ ముగిస్తున్నాను. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, డీ ఎస్ పీ నాగేంద్రచారి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## “77”వ గణతంత్ర వేడుకల్లో

# ముద్దం నర్సింహా యాదవ్

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ ప్రాంతాల్లో “77”వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా డివిజన్ కార్యాలయంతో పాటు కాలనీలు బస్తీలలో జాతీయ జెండాను కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ ఆవిష్కరించారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భంగా గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి భారతదేశ ప్రజాస్వామ్యానికి పునాదిరాయి వేశారని అన్నారు. గణతంత్ర రాజ్యాంగ భారతదేశం ప్రపంచంలోకెల్లా గొప్ప దేశంగా అభివృద్ధి చెందిందని అన్నారు. ప్రపంచ దేశాలలో గొప్పగా గణతంత్ర రాజ్యాన్ని నిర్మించిన ఆనాటి స్వాతంత్ర సమరయోధులు మేధావులను ఆయన స్మరించుకున్నారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అలాగే గ్రీన్ వుడ్ స్కూల్, చెక్ పోస్ట్ ఆటో స్టాండ్,శ్రీ సాయి కాలనీ, ఆర్ ఆర్ నగర్,ఓల్డ్ ఏజ్ హోమ్, హెచ్ఐఎల్ పార్క్ ,నాయక్ ఆటో స్టాండ్ ,శంకర్ ఎంక్లేవ్ , గౌరీ నగర్,పివి ఎంక్లేవ్, వెస్లీ టీచర్స్ కాలనీ, మైనార్టీ స్కూల్, సీనియర్ సిటిజన్ పార్క్ లో,రోడ్ నెంబర్ 3 ఆటో స్టాండ్, సాయి నారాయణపూరి కాలనీ,ఎస్సీ బస్తీ ఓబిసీ, మాలబస్తీ కమ్యూనిటీ హాల్, శాంతినికేతన్ కాలనీ, బృందావన్ కాలనీ, అస్మత్ భారత్ మాత భవన్, ఫ్రెండ్స్ కాలనీ, పందుల బస్తీ చౌరస్తా, కోయబస్తి, ఎల్‌బీ నగర్, ఎల్బీనగర్ లలిత హౌస్, గంగపుత్ర సంఘం,డాక్టర్ సుధాకర్ పాస్టర్, అస్మత్ పెట్ ఎస్సీ బస్తీ, సెంట్రింగ్ కార్యాలయం, సమత నగర్ లో తదితర ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణలునిర్వహించారు. ఈ కార్యక్రమంలో 119 డివిజన్ అధ్యక్షులు ఇర్ఫాన్ బాయ్,సెక్రెటరీ హరినాథ్, మహిళా అధ్యక్షురాలు లలిత గౌడ్, సీనియర్ నాయకులు కర్రె జంగయ్య, గడ్డం నర్సింగ్ రావు,బిసి సెల్ అధ్యక్షులు మట్టి శ్రీనివాస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బుర్రీ యాదగిరి, పిట్ల రాజు, బాల్రాజ్, శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకుడు ముద్ద మల్లికార్జున్ యాదవ్, ముద్దం సాయిబాబా యాదవ్,నాగేష్, బాలరాజ్,ఉదయ్ రాణి,రాజు గౌడ్,సలీం బాయ్,ఇమ్రాన్ భాయ్,జె కే బాయ్, అల్తాఫ్ రాజా, షర్ఫుసోఫీ, జనాభాయ్, దేవేందర్, షకీల్ , మల్లేష్ యాదవ్, వేంకట్, చంద్రయ్యా. శ్యామ్, మున్నా, మోహన్,చందు యాదవ్, శేఖర్ యాదవ్,అశోక్, మణిరత్నం సీనియర్ నాయకులు కార్యకర్తలు మహిళలు కాలనీవాసులు బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.




# క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**ఘనంగా ముగిసిన 36వ మైత్రి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్**

**విజేతగా నిలిచిన ఎస్సార్ గ్రూపు జట్టు**

పటాన్ చెరు(ప్రశ్న న్యూస్) బాల్యం నుండే క్రీడల పై ఆసక్తి పెంపొందించుకోవడం మూలంగా మానసిక ధైర్యం, శారీరక దృఢత్వం లభిస్తుందని, నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో మైత్రి క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న 36వ మైత్రి ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాల చరిత్ర గలిగిన మైత్రి క్రీడా మైదానం రాష్ట్ర, జాతీయ క్రీడలకు వేదికగా నిలిచిందని తెలిపారు. ఎంతో మంది క్రీడాకారులు ఇదే మైదానంలో శిక్షణ పొంది జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. పటాన్చెరులో క్రికెట్ అభివృద్ధికి మైత్రి క్రికెట్ క్లబ్ అందిస్తున్న సేవలను ఆయన ప్రశంసించారు. క్రీడలపై ఆసక్తి ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులకు ఆర్థిక సాయం అందించడంతోపాటు వారి అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా మినీ స్టేడియాలు నిర్మిస్తూ ప్రతి ఒక్కరిలో క్రీడలపై ఆసక్తిని పెంపొందిస్తున్నామని తెలిపారు. గత సంవత్సర కాలంగా మైత్రి స్టేడియం వేదికగా రాష్ట్ర జాతీయ క్రీడలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. అతి త్వరలో జాతీయస్థాయి మహిళా కబడ్డీ పోటీలు సైతం నిర్వహించబోతున్నట్లు తెలిపారు. అనంతరం విజేతగా నిలిచిన ఎస్సార్ గ్రూప్, రన్నర్ గా నిలిచిన వన్ ఛాంపియన్ జట్లకు లక్ష రూపాయల నగదు బహుమతుల తో పాటు ట్రోఫీలను అందజేశారు.




## ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డు అందుకున్న వాసం వెంకటేష్



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) సిరిసిల్లకు చెందిన వాసం వెంకటేష్ కలెక్టర్ గరీమ అగర్వాల్ చేతులు మీదుగా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకున్నారు. ప్రతి సంవత్సరం అత్యుత్తమ పనితీరు, అంకితభావం కనబర్చిన అధికారులకు ఇచ్చే అవార్డులలో పౌర సంబంధాల శాఖ నుండి ఉత్తమ ఫోటోగ్రాఫర్ గా సిరిసిల్ల కు చెందిన వాసం వెంకటేష్ కలెక్టర్ గరీమ అగర్వాల్ చేతులు మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి పి ఆర్ ఓ మామిండ్ల దశరథం మాట్లాడుతూ కొందరికి ఉద్యోగం వల్ల గౌరవం లభిస్తుంది. మరికొందరు తాను చేస్తున్న ఉద్యోగానికే గౌరవాన్ని తెచ్చిపెడతారు. సిరిసిల్లకు చెందిన వాసం వెంకటేష్ రెండో కోవకు చెందిన వ్యక్తి. అందుకే అవార్డులు తనను వరించి మురిసిపోతాయి అని అన్నారు. పౌర సంబంధాల శాఖ ఫోటోగ్రాఫర్ వాసం వెంకటేష్ ను అధికారులు జర్నలిస్టులు తదితరులు అభినందించారు.

## బహుజనులకు రాజ్యాధికారం అందే వరకు పోరాడుదాం : కట్ట సతీష్

**టిఆర్ఎల్ డి పార్టీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు**



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) సోమవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని టిఆర్ఎల్ డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కట్ట సతీష్ విద్యానగర్ లోని పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది త్యాగాల ఫలితంగానే భారతదేశానికి స్వాతంత్రం వచ్చిందని తెలిపారు. తెచ్చుకున్న స్వతంత్ర దేశంలో అందరికి సమాన హక్కులను కల్పించిన అంబేద్కర్ ను ఆదర్శంగా తీసుకుని రానున్న రోజుల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బహుజనులకు రాజ్యాధికారాన్ని అందించేందుకు రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జాతీయ అధ్యక్షులు, కేంద్ర మంత్రి జయంత్ చౌదరి, రాష్ట్ర అధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ సూచనలు, సలహాలతో తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ప్రెసిడెంట్ పృథ్వి, జిల్లా కార్యదర్శి వీరన్న, సోషల్ మీడియా ఇంచార్జి శ్రీకాంత్, మైనారీ సెల్ ప్రెసిడెంట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

**జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రోవీసీ ప్రొఫెసర్ డీ.ఎస్.రావు**

**అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు**






పటాన్‌చెరు (ప్రశ్న న్యూస్ ) హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం 26 జనవరి 2026న గాంధీ కూడలిలో 77వ గణతంత్ర దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా, దేశభక్తి స్ఫూర్తితో జరుపుకున్నారు. వందేమాతరం ఇతివృత్తంగా, ఆత్మనిర్బర్ భారత్ చొరవతో అనుసంధానించిన ఈ వేడుకలు, సార్వభౌమాధికారం, ప్రజాస్వామ్య విలువలు, స్వావలంబన పట్ల జాతి నిబద్ధతను ప్రతిబింబించాయి. ఉదయం 9.00 గంటలకు గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ నిర్మాణంలో విద్యా సంస్థల కీలక పాత్రను వివరిస్తూ స్ఫూర్తిదాయకమైన ప్రసంగం చేశారు. సాంకేతికత, ఆవిష్కరణలు, నిరంతర శ్రేష్ఠత ద్వారా దేశ నిర్మాణంలో విశ్వవిద్యాలయాలు పోషించే కీలక పాత్రను ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తాము ఎంచుకున్న రంగాలలో ప్రపంచ స్థాయి ఫలితాలను సాధించడానికి దృష్టి కేంద్రీకరించి, పట్టుదలతో, నిబద్ధతతో ముందుకు సాగాలని ఆయన కోరారు. విశ్వవిద్యాలయ భద్రతా సిబ్బందితో పాటు ఎన్ సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల కవాతు నిర్వహించారు. గీతం విద్యార్థి విభాగాలైన కళాకృతి, అన్వేష క్లబ్బుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్సాహభరితమైన బిహు నృత్యం ఆహూతులను అలరించాయి. ఎన్ సీసీ, ఎన్ఎస్ఎస్, భద్రతా సిబ్బందికి వారి అంకితభావ సేవకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. గీతం స్టూడెంట్ లైఫ్ నిర్వహించిన ఈ కార్యక్రమం తేనేటి విందుతో ముగిసింది. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా, వారందరినీ ఐక్యంగా, దేశభక్తితో ఈ వేడుకలు ఏకం చేశాయి.

## ఐలాపూర్ గ్రామంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం ఐలాపూర్ గ్రామంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అయిలాపూర్ గ్రామం లోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం, యువజన సంఘం ఆధ్వర్యం లో మువ్వన్నెల జెండాను సంఘం అధ్యక్షులు గోనె కృష్ణ ఎగురవేసి గణతంత్ర వేడుకలను నిర్వహించారు. ప్రతి సారి లాగే ఈ సారి కూడా సంఘం భవనం ముందు గణతంత్ర వేడుకలను నిర్వహించామని సంఘం కార్యవర్గం తెలిపారు. గణతంత్ర వేడుకల తో పాటు అన్ని పండుగలను నిర్వహిస్తామని అన్నారు.నా దేశం నా భారతదేశం అని కాలరెత్తి చెప్పుకునే స్థాయి కల్పించిన రోజు ఈ రోజు అని ఎందరో త్యాగధనుల ఫలితమే భారత దేశశీ స్వేచ్ఛ వాయులోకి వచ్చిన రోజు అని అన్నారు. ఈ కార్యక్రమంలోసంఘం అధ్యక్షులు గోనె క్రిష్ణ, ఉపాధ్యక్షులు గుల్లె బాలకిషన్, కార్యదర్శి సంతోష్ , ఉప కార్యదర్శి పిస్కప్రకాష్, కోశాధికారి చిక్కెల నవీన్, సలహాదారులు అవధూత నర్సయ్య, ఊరటి సాయిలు, శెర్ల వేంకటేశ్వర్, బిల్లా వెంకటేశ్వర్ , యువజన సంఘం సభ్యులు ప్రశాంత్, సుమంత్, గణేష్, రవి, కుశాల్, నరేష్, చిక్కెల నరేష్ , సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## 77వ గణతంత్ర వేడుకల్లో సిఐఈఎఫ్ఎల్ కాలనీ వాసులు.



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి ఆనంద్ బాగ్ లో ఉన్న సిఐఈఎఫ్ఎల్ కాలనీలో"77"వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా కమిటీ ఏర్పాటు చేసిన రిపబ్లిక్ డే దినోత్సవం కార్యక్రమంలో కాలనీ వాసులు భారీగా తరలివచ్చి జాతీయ జెండాను ఆవిష్కరించారు.రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భంగా గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నట్లు సిఐఈఎఫ్ఎల్ కమిటీ పి.కృష్ణపేర్కొన్నారు.డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి భారతదేశ ప్రజాస్వామ్యానికి పునాదిరాయి వేశారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.గణతంత్ర రాజ్యాంగ భారతదేశం ప్రపంచంలోకెల్లా గొప్ప దేశంగా అభివృద్ధి చెందిందని తెలిపారు.ప్రపంచ దేశాలలో గొప్పగా గణతంత్ర రాజ్యాన్ని నిర్మించిన ఆనాటి స్వాతంత్ర సమరయోధులు మేధావులను ఆయన స్మరించుకున్నారు.రాజ్యాంగ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని ఆకాంక్షించారు.అలాగే ఈ కార్యక్రమంలో ఎం.ఓం రాజ్,జాయింట్ సెక్రటరీ చంద్రకళ,ట్రెజరీ శేషగిరి, సభ్యులు అరుణ్ కుమార్ పెద్ది రాజు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 77వ రిపబ్లిక్ డే వేడుకలు



నిజామాబాద్(ప్రశ్న న్యూస్)77వ గణతంత్ర దినోత్సవశీగణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి తన ప్రసంగం ద్వారా తెలియజేశారు.కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ77వ గణతంత్ర దినోత్సవ సందర్భముగా జిల్లా ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, అధికారులకు, మీడియా ప్రతినిధులకు నా శుభాకాంక్షలు, విద్యార్థినీ, విద్యార్థులకు నా ఆశీస్సులు.దేశ రాజ్యాంగాన్ని రూపొశీదించుటకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసి దాదాపు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు 308 మంది సభ్యులు విపులంగా చర్చించి, సవరణలు చేసి అతి పెద్ద ప్రజాస్వామ్య భారత రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగింది.ఈ వేడుకల్లో డీఆర్డీఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్ రావు, డీఎస్ఓ అరవింద్ రెడ్డి, అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, స్వాతంత్ర్య సమరయోధులు, ప్రజలు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. అంతకుముందు క్యాంపు ఆఫీసులో, జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి మువ్వన్నెల జెండా ఆవిష్కరించారు

## అతికం రాజశేఖర్ గౌడ్ సేవా ప్రయాణానికి శుభాకాంక్షలు - ఘన సన్మానం

**- రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రాజశేఖర్ కు సన్మానం**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఇటీవల నియామకమైన అతికం రాజశేఖర్ గౌడ్?ను రాజన్నా7 సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలో సోమవారం మిత్రులు,శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, వార్డు సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాలని, గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని,నిత్యం ప్రజాసేవలో మరింత ముందుకు సాగి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి గ్రామ ఉపసర్పంచ్ కల్లెపల్లి చంద్రయ్య, వార్డు సభ్యులు అక్కరాజు తిరుపతి, బత్తిని అనిల్ గౌడ్, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం తిరుపతి, నాయకులు అతికం చంద్రయ్య, బోయిని వేణు యాదవ్, పొత్తూరి సురేష్ బాబు, ఎడపల్లి వంశీ, తాళ్లపల్లి గణేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత ఉద్యోగులను వేధించడం వైసిపి నేతలకు అలవాటే-గోవిందవాసు మాదిగ



**నెల్లూరు బ్యూరో (ప్రశ్న న్యూస్)** నాయుడుపేట పట్టణ సీఐ బాబి, హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజులను సిబిఐ అధికారులకు పట్టించడంలో వైసిపి నేతకామిరెడ్డి సత్యనారాయణరెడ్డి రాజకీయ చతురతలో భాగమని ఎం ఆర్ పి ఎస్ జాతీయ కార్యదర్శి గోవింద వాసు మాదిగ అన్నారు. సోమవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఉన్నతాధికారులను అవినీతికి ప్రోత్సహించడం,తన మాట వినకపోతే ఇబ్బందులకు గురిచేయడం,ఏసీబీకి పట్టించడం లాంటివి ఆయనకు అలవాటే అన్నారు.పెళ్ళకూరు మండలంలో దళితులకు,అగ్రవర్ణాలకు మధ్య కులవివక్ష ప్రేరేపించడంలో అగ్రఘన్యుడని విమర్శించారు. మైనింగ్ మాఫియాలో అగ్ర తాంబూలం ఆయనదే అన్నారు. ఎన్నికల సమయంలో పోలీసులు, ప్రత్యర్థులపై దాడులు చేయడం ఆయనకు అలవాటేనని విమర్శించారు.అవినీతి ఫిర్యాదులు చేసే అర్హత సత్యనారాయణ రెడ్డికి లేదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కంటేపల్లి రాజేష్ మాదిగ,మావుడూరు మనోహర్ మాదిగ,మేకల శ్రీధర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు

## ఏసీబీకి చిక్కిన హెడ్ కానిస్టేబుల్

- నాయుడుపేట పోలీస్ స్టేషన్ పై ఏసీబీ అధికారులు దాడులు
- హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజులను ఏసీబీ అధికారులు వలపని పట్టుకున్న వైనం
- హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అతని వద్ద నుంచి 30వేల నగదును సైతం ఏసీబీ అధికారులు స్వాధీనం
- సీఐ బాబి,హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్ రాజులపై కేసు నమోదు



**అమరావతి ( ప్రశ్న న్యూస్)** నాయుడుపేట పోలీస్‌స్టేషన్ అర్బన్ సీఐ బాబితో పాటు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజులను ఏసీబీ అధికారులు వలపన్ని ఆదివారం రాత్రి పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజును రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అతని వద్ద నుంచి 30వేల నగదును సైతం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాయుడుపేట అర్బన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సీఐ బాబితో పాటు హెడ్‌కానిస్టేబుల్ ద్వారా పలు విషయాలను విచారించి తెలుసుకున్నారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్‌లోని పలు రికార్డులను సైతం ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఏసీబీ అడిషనల్ ఎస్పీ విమలకుమారి విలేకరులతో మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వర మద్యం షాపులో పనిచేస్తున్న వ్యక్తిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు విషయమై పలుమార్లు సీఐ దుకాణ యజమానులను నగదు డిమాండ్ చేశారని అంతేకాకుండా ప్రతి నెల కొంత మొత్తం నగదు ఇవ్వాలంటూ హుకుం జారీ చేసినట్లు వెల్లడించారు. దీంతో దుకాణ యజమానితో పాటు అక్కడ పనిచేస్తున్న ఏసీబీని ఆశ్రయించినట్లు ఆమె వెల్లడించారు. ఆదివారం హెడ్?కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజు నేరుగా మద్యం షాపు సమీపంలోకి వెళ్లి ఫోన్ చేసి దుకాణ సమీపంలో ఉన్నానని నగదు తెచ్చి ఇవ్వాలని క్యాషియర్?కు సూచించారన్నారు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు ఇచ్చిన సూచన మేరకు క్యాషియర్? రూ 30వేల నగదు తీసుకుని హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్‌రాజుకు ఇచ్చిన వెంటనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సీఐ బాబితో పాటు హెడ్‌కానిస్టేబుల్ రామ్మోహన్ రాజులపై కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం అనంతపురం నుంచి వచ్చిన డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఇన్‌చార్జ్ గా ఉండడంతో ఆయన సారథ్యంలో ఈ దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో అడిషనల్ ఎస్పీతో పాటు సీఐ మల్లిఖార్జునరావు, సిబ్బంది ఉన్నారు.

## బోయిన్ పల్లి మార్కెట్లో 77వ గణతంత్ర వేడుకలు:సోమ



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో నిన్న 77 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.మంగళవారం ఉదయం సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమ దేవేందర్ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతరెండున్నర దశాబ్దాల పాటు నుంచి గణతంత్ర వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బోయిన్ పల్లి మార్కెట్ సెక్రటరీ ఎం.వేంకన్న, గ్రేడ్ వన్ అధికారి మధులిక,మార్కెట్ కమిటీ చైర్మన్ రాగిరి ఆనంద్ బాబు, వైస్ చైర్మన్ దేవేందర్, కమిటీ సభ్యులు అస్లం, రాము,సికింద్రాబాద్ వెజిటబుల్ కమీషన్ ఏజెంట్ల అసోసియేషన్ కార్యదర్శి చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడు మిర్యాల శ్రీనివాస్, బిక్షపతి, అంజి,బొంతల సత్యనారాయణ, బోయిన్ పల్లి మార్కెట్ హమాలీ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలాభివృద్ధికి రాజ్యాంగమే పునాది

**- నీలోజిపల్లి గ్రామ సర్పంచ్ : అనుముల భాస్కర్**

**- నీలోజిపల్లిలో దేశభక్తి వెల్లువెత్తిన గణతంత్ర వేడుకలు**





**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నీలోజిపల్లి గ్రామంలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సర్పంచ్ తొలిసారిగా తన సర్పంచ్ హోదాలో త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనుముల భాస్కర్ మాట్లాడుతూ,"భారత రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులతో పాటు బాధ్యతలను కూడా గుర్తుచేస్తుంది. స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేసిన మహనీయుల ఆశయాలను కొనసాగించడమే మన కర్తవ్యం. గ్రామ అభివృద్ధి, సామాజిక సమానత్వం, విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసి ముందుకు సాగాలి. దేశ అభివృద్ధికి గ్రామాలే పునాది. యువత క్రమశిక్షణతో, దేశభక్తితో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.కార్యక్రమం అనంతరం సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ క్రీడా పోటీల్లో విజయం సాధించిన జట్లకు మెమొంటోలు అందజేసి అభినందించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరైన సర్పంచ్, క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థి దశలోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

**- ప్రధానోపాధ్యాయురాలు సుజన**

**- కురుగొండ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా గణతంత్ర దినోత్సవ దినోత్సవ వేడుకలు**



**ఓజిలి (ప్రశ్న న్యూస్)** స్వాతంత్ర్యం, రాజ్యాంగం ప్రాముఖ్యతను, భారతదేశం ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్య దేశంగా, నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడం గర్వకారణమని స్వాతంత్ర పోరాటంలో అసువులు బాసిన త్యాగధనులను విద్యార్థిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని కురుగొండ గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సుజన ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యారాలు సుజన జాతీయ జెండాను ఆవిష్కరించి, గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులు జాతీయ గీతం ఆలపించి దేశభక్తి నినాదాలతో ప్రాంగణాన్ని మార్మోగించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కార్యక్రమానికి హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులచే దేశభక్తి గీతాలు, ప్రసంగాలు నిర్వహించగా, భారత రాజ్యాంగ విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దేశ సమగ్రత, ఐక్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరునిదని ప్రధానోపాధ్యాయురాలు సుజన తెలిపారు. స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగాన్ని మన పూర్వీకులు పెద్దలు ఎంతో అనుభవ పూర్వకంగా అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా తయారు చేయడంతోనే మనం ప్రస్తుతం అన్ని ఫలాలను స్వేచ్ఛగా అనుభవించ గలుగుతున్నామన్నారు. విద్యార్థిని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రామానికి మండలానికి జిల్లాకి తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ ఒడిలో మత్స్యకారులు

**- మత్స్యకారుల చేతిలో జాతీయ జెండా**



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం సిర్పూర్ గ్రామ పరిసరాల్లోని ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్ వద్ద మత్స్యకారులు హృదయాన్ని తాకే విధంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసి తమ దేశభక్తిని ఘనంగా చాటుకున్నారు.రోజూ నీటిలో జీవనోపాధి వెతుక్కునే చేతులే, దేశభక్తితో కనిపించే చేతులుగా మారి గంగమ్మ ఒడిలో మువ్వన్నెల జెండాను ఎగురవేసిన దృశ్యం ప్రతి భారతీయుని గుండెను కదిలించేలా నిలిచింది. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ,దేశం మనకు ఇచ్చింది ఎంతో దేశానికి మనం ఇవ్వాల్సింది దేశభక్తి, ఐక్యత, సేవాభావం అని పిలుపునిచ్చారు.గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇలాంటి పవిత్ర భావాలు వెల్లివిరియడం గర్వకారణమని, ఈ కార్యక్రమం మత్స్యకార యువతకు మార్గదర్శకంగా నిలుస్తుందని గ్రామస్తులు ప్రశంసించారు. మువ్వన్నెల జెండా ఎగిరిన ప్రతి క్షణం మత్స్యకారుల గుండెల్లో దేశం దడదడలాడిన క్షణం!

# అక్రమ నిర్మాణాలు.. అగ్ని ప్రమాదాలు

- ప్రాణాలు పోతున్నా కదలని పాలనా వ్యవస్థ
- అగ్ని ప్రమాదాలు పెరుగుతున్నా కఠిన చర్యలు ఎక్కడ.?
- అక్రమ సెల్లార్లు,అక్రమ అంతస్థులు అగ్నికి ఆహుతి అవుతున్న అమాయకులు
- అధికారుల నిర్లక్ష్యమే అగ్నిప్రమాదాలకు కారణమా.?
- గతంలో బేగంపేట సర్కిల్లో రెండు అక్రమ నిర్మాణాలు అగ్నికి ఆహుతి సామాన్యులు బలి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నగరాలు, పట్టణాల్లో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అనుమతులు లేని సెల్లార్లు, నిబంధనలకు మించి నిర్మించిన అంతస్తులు, ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించని వాణిజ్య భవనాలు అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అయినప్పటికీ






సంబంధిత శాఖలు నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇటీవల చోటుచేసుకున్న అగ్ని ప్రమాదాల్లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ప్రమాదాలు జరిగిన ప్రతిసారి ప్రభుత్వం కేవలం విచారణలు, హెచ్చరికలకే పరిమితమవుతోంది తప్ప చర్యలు తీసుకోవడం లేదు. మూల కారణాలపై మాత్రం శాశ్వత పరిష్కారం కనిపించడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### నిబంధనలు కాగితాలకే పరిమితమా.?

భవన నిర్మాణ నిబంధనల ప్రకారం ఫైర్ ఎగ్జిట్ మార్గాలు, ఎమర్జెన్సీ మెట్లు, అలారం వ్యవస్థలు తప్పనిసరి. అయితే అనేక భవనాల్లో ఇవి కేవలం అనుమతి పత్రాల్లోనే కనిపిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. అనుమతులిచ్చే సమయంలో, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేసే సమయంలో తనిఖీలు సక్రమంగా జరగడం లేదని అధికారులు కేవలం లంచాలు తీసుకొని ఎన్ఓసీలు ఇస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ప్రమాదాల బారిన పడేది సామాన్యులే..

అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నది సామాన్య ప్రజలే. కార్మికులు, ఉద్యోగులు, వినియోగదారులు బలవుతుండగా, భవన యజమానులు, అక్రమ నిర్మాణాలకు సహకరించిన అధికారులు మాత్రం బాధ్యత నుంచి తప్పించుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రమాదం జరిగిన వెంటనే తాత్కాలిక చర్యలు తీసుకోవడం, కొద్ది రోజుల్లోనే విషయం మరచిపోవడం పరిపాటిగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సహకరించిన టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, డిప్యూటీ కమిషనర్లపై ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ప్రజల ప్రశ్నిస్తున్నారు.

### అక్రమ నిర్మాణాలకు అధికారుల సహకారమే కారణమా.?

అక్రమంగా నిర్మాణాలు జరగాలంటే మున్సిపల్, టౌన్ ప్లానింగ్, ఫైర్ శాఖల నిర్లక్ష్యం లేదా సహకారం తప్పనిసరిగా ఉండాల్సిందేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. టౌన్



ప్లానింగ్ అధికారులు లంచాలు తీసుకొని చూసీ చూడనట్టు వ్యవహరించడం వల్లే నిబంధనల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు ఎప్పుడు.?

ప్రమాదాలు జరిగిన తర్వాత మాత్రమే కాకుండా ముందస్తుగా అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా కఠిన చర్యలు చేపట్టినప్పుడే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని అభిప్రాయపడుతున్నారు.

ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలకు సంబంధించిన భవనాలు పూర్తిగా అక్రమ నిర్మాణాలు అక్రమ సెల్లార్లు ఉన్నాయని వాటికి సంబంధించిన టౌన్ ప్లానింగ్ అధికారులపై కేసులు నమోదు చేయకపోవడం శాఖపరమైన చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే పాలకులు అవినీతికి పాల్పడుతున్న అధికారులను రక్షిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు

### పరిహారాలతో సమస్య తీరుతుందా.?

ప్రమాదాలతో ప్రాణాలు పోయిన తర్వాత పరిహారాలు ప్రకటించడం సరిపోతుందా.?

ప్రమాదాలకు కారణమైన వారిపై ఎప్పుడు కఠిన చర్యలు తీసుకుంటారు.?

ఇదేనా ప్రజల ప్రాణాలకు ప్రభుత్వం ఇచ్చే విలువ.?

ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత మున్సిపల్ శాఖ పై, పాలకులపై ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరి దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారో.? అధికారులపై ఎలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటారో వేచి చూడాలి.

# మల్కాజిగిరి సర్కిల్‌లో నాసిరకంగా బాక్స్ డ్రైనేజీ పనులు

**నాణ్యతకు తిలోదకాలు, అవినీతికి అడ్డుకట్టే లేదా.?**

**ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకునేనా.?**

మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆర్టీసీ కాలనీ వెళ్లే ప్రధాన రహదారిపై చేపట్టిన బాక్స్ డ్రైనేజీ పనులు ప్రజా ప్రయోజనాలకంటే అధికారుల అవినీతికే అద్దం పడుతున్నాయి. కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చవుతున్నా, జరుగుతున్న పనులు మాత్రం నాసిరకం, అశాస్త్రీయం, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

క్యూరింగ్ లేకుండానే కాంక్రీట్ పనులు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాక్స్ డ్రైనేజీ నిర్మాణంలో అత్యంత కీలకమైన నీటి క్యూరింగ్?ను ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్ పూర్తిగా విస్మరించడం గమనార్హం. కాంక్రీట్ పోసిన వెంటనే తగిన కాలం పాటు నీటితో సంరక్షించాల్సిన నిబంధనలను తుంగలో తొక్కుతూ ఎండలోనే వదిలేస్తున్న






దృశ్యాలు కళ్లకు కడుతున్నాయి. ఫలితంగా నిర్మాణ బలం తగ్గి, రానున్న రోజుల్లో డ్రైనేజీ కూలిపోతుందన్న భయం స్థానికులను వెంటాడుతోంది.

### లంచాలతో 'క్వాలిటీ ఓకే' ముద్ర.?

పనుల్లో నాణ్యత లేనప్పటికీ, క్వాలిటీ కంట్రోల్ అధికారులు కళ్లుమూసుకుని 'ఓకే' సర్టిఫికెట్లు ఇస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులు పరిశీలించకుండా లంచాల మత్తులో నిబంధనలను పక్కన పెట్టి సంతకాలు చేస్తున్నారని స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ప్రజల భద్రతతో చెలగాటం ఆడుతున్న ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం ఎవరి ప్రయోజనాల కోసం.? స్థానిక కార్పొరేటర్ ఎమ్మెల్యే అసలు పట్టించుకుంటున్న దాఖలాలు లేవని కేవలం ప్రారంభోత్సవాలకు శంకుస్థాపనకు తప్ప వాళ్ళు ఏ రోజు ప్రజల సమస్యలను పట్టించుకున్న దాఖరాలు లేవన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### అధిక ఎస్టిమేషన్, కమిషన్ల దందా.?

ఇంజనీరింగ్ అధికారులు చేస్తున్న పనులలో, ఈ బాక్స్ డ్రైనేజీ పనులకు వాస్తవ ఖర్చుకన్నా భారీగా ఎస్టిమేషన్ వేయడం వెనుక పెద్ద కమిషన్ల దందా నడుస్తోందన్న స్థానికుల అనుమానాలు బలపడుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ప్రజాధనాన్ని పంచుకుంటున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అభివృద్ధి పేరుతో దోపిడీకి పాల్పడటం ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ మారుతుంది.

### అధికారుల అవినీతి, కాంట్రాక్టర్‌కు అడ్డదారులు..

అధికారుల అవినీతిని అలుసుగా తీసుకున్న కాంట్రాక్టర్ నాణ్యత లేని సామగ్రితో, అశ్రద్ధగా పనులు చేస్తున్నాడని, ముఖ్యమైన నీటి క్యూరింగ్ కూడా అసలు చేయడం లేదని ఏదో తూతూ మంత్రంగా చెస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరైన మందం లేకుండా కాంక్రీట్, నిబంధనలకు విరుద్ధమైన నిర్మాణ పద్ధతులు పాటించకుండా అధికారుల పర్యవేక్షణ అసలు లేకుండా జరుగుతుందని ఇవన్నీ కలిసివచ్చి ప్రజలకు ముప్పుగా మారుతున్నాయి.

### వాహనాదారులకు నరకయాత..

దీర్ఘకాలంగా బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తి కాకపోవడంతో ఆర్టీసీ కాలనీ రహదారి నిత్యం ట్రాఫిక్ జామ్?లకు కేంద్రంగా మారింది. గుంతలు, దుమ్ము, మట్టి, అడ్డంగా వేసిన బ్యారికేడ్లతో వాహనాదారులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. రహదారిపై చేస్తున్న డ్రైనేజీ పనులకు ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆ గుంతలో పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇంజనీరింగ్ అధికారులు ఇది కూడా గమనించకపోవడం చూస్తుంటే కాంట్రాక్టర్ కు ఎంత భారీ స్థాయిలో అమ్ముడుపోయారు అర్థం చేసుకోవచ్చని స్థానికులు మండి పడుతున్నారు.

### నాసిరకం పనులకు బాధ్యులు ఎవరు.?

బాక్స్ డ్రైనేజ్ పనుల వ్యవహారానికి బాధ్యులెవరు.?

నాసిరకం పనులు చేస్తున్న కాంట్రాక్టరా.?

లంచాలకు లొంగిన క్వాలిటీ కంట్రోల్ అధికారులా.?

అధిక ఎస్టిమేషన్ వేసి కమిషన్లు దోచుకుంటున్న ఇంజనీరింగ్ అధికారులా.? అవినీతికి పాల్పడుతున్న అధికారులపై

తక్షణ చర్యలు తీసుకోవాలని ఈ బాక్స్ డ్రైనేజీ పనులపై ఉన్నతస్థాయి విచారణ జరిపి, నాణ్యత పరీక్షలు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఇది అభివృద్ధి కాదు, భవిష్యత్తులో భారీ ప్రమాదాలకు పునాది అవుతుందన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ప్రజాధనం దోపిడీకి, నాసిరకం నిర్మాణాలకు మల్కాజిగిరి సర్కిల్ వేదిక అవుతుందని జిహెచ్ఎంసి కమిషనర్, జోనల్ కమిషనర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని నిజమైన అభివృద్ధికి పాటుపడాలని స్థానికులు కోరుతున్నారు.

# సిట్ నోటీసులు పూర్తిగా రాజకీయ డ్రామానే

- నైని కుంభకోణాన్ని కప్పిపుచ్చుకునేందుకే టాపింగ్ కేసు డ్రామా
- ప్రజా సమస్యల నుండి దృష్టి మళ్లించేందుకే సిట్ డ్రామా
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా నేత : అనుముల భాస్కర్




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్ టెలిఫోన్ టాపింగ్ కేసు పేరుతో మాజీ ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ కు సిట్ నోటీసులు జారీ చేయడాన్ని బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకులు అనుముల భాస్కర్ తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ మొత్తం సిట్ విచారణ ప్రక్రియ ప్రజలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆడుతున్న రాజకీయ నాటకమని విమర్శించారు. కేసుకు అసలు సంబంధం లేని ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తూ వరుసగా విచారణకు పిలవడం వెనుక స్పష్టమైన రాజకీయ కక్షసాధింపు దాగి ఉందన్నారు. ప్రజా సమస్యలు, అభివృద్ధి వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే మున్సిపల్ ఎన్నికల వేళ ఈ తరహా విచారణల హడావుడిని కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని సృష్టిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు, కుంభకోణాల నుంచి ప్రజల చూపు మళ్లించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిట్?ను ఒక రాజకీయ ఆయుధంలా ఉపయోగిస్తోందని భాస్కర్ మండిపడ్డారు. నైని బొగ్గు గనుల కుంభకోణం వెలుగులోకి రావడంతో ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిలో ఉందని, ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకే ఈ నోటీసుల డ్రామా నడుస్తోందని ఆయన పేర్కొన్నారు. గతంలో ఇదే కేసు పేరుతో హరీష్ రావును,కేటీఆర్ ను కూడా విచారించినా ఏమీ తేలలేదని గుర్తు చేశారు. ఇప్పుడు అదే స్క్రిప్ట్?ను సంతోష్ కుమార్ పై ప్రయోగిస్తూ రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని భాస్కర్ విమర్శించారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

- రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలి
- పురాణిపేట గ్రామ సర్పంచ్ : బుర్ర సుమ - దేవేందర్



భీంగల్ (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా, భీంగల్ మండలంలోని పురాణిపేట గ్రామంలో సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకలను గ్రామ సర్పంచ్ బుర్ర సుమ -- దేవేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ బుర్ర సుమ -- దేవేందర్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛలను ప్రతి పౌరుడు సద్వినియోగం చేసుకుంటూ దేశ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం రాజ్యాంగ విలువలు, జాతీయ ఐక్యతను గుర్తు చేసే మహత్తర దినమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ కర్తవ్యబద్ధతతో ముందుకు సాగితే పురాణిపేట గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గం సభ్యులతో పాటు గ్రామ యువత, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పిల్లల్లో మేధాశక్తిని పెంచుతున్న వేదిక్ మ్యాథ్స్





విశాఖపట్నం (ప్రశ్న న్యూస్) నవంబర్ 16న శ్రీ సాయి రాజేశ్వరి ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో కెనడా పిల్లల కోసం నిర్వహించబడిన అంతర్జాతీయ లైవ్ ప్రోగ్రామ్‌లో పిల్లలు వేదిక్ మ్యాథ్స్ మరియు అబాకస్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవిష, సువిక్ష, కుమార్ ఆదిత్య, రఘురామ్ తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. పిల్లల ప్రదర్శన ఎంతో ఆకట్టుకునేలా ఉందని అందరి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో పిల్లలను ప్రోత్సహించినసునీత, సునిల్, శ్రీను, వెంకట లక్ష్మి పిల్లల ప్రతిభను హృదయపూర్వకంగా అభినందించారు. పిల్లలకు సరైన మార్గనిర్దేశం చేస్తూ, వారి విజయంలో కీలక పాత్ర పోషించినగురువు డాక్టర్ రాజా రాజేశ్వరికి ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమం పిల్లల్లో ఆత్మవిశ్వాసం, మేధస్సు, గణితంపై ఆసక్తిని మరింత పెంపొందిస్తుందన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని నేటితరాలకు తెలియజేయాలి : మోరే రూప రమేష్

### 17వ డివిజన్ లో గణతంత్ర దినోత్సవ వేడుకలు



కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) కొత్తగూడెం కార్పొరేషన్ పరిధి 17 డివిజన్ లో 77 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు స్థానిక పెద్ద మనుషుల సమక్షంలో మాజీ కౌన్సిలర్ మోరే రూప ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 17 డివిజన్ కార్పొరేట్ అభ్యర్థి మోరే రమేష్ స్థానిక నాయకులు, చిన్నారులతో కలసి రాజ్యాంగ నిర్మాత భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా, ప్రజాస్వామ్య పరిరక్షణే ప్రజాస్వామ్య ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588